విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

సోమవారం 04 ఆగస్టు 2025 8 పేజీలు

సీపీఐ గుంటూరు జిల్లా మహాసభలను

జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో ఈ నెల 17, 18 తేదీలలో జరుగనున్న సీపీఐ గుంటూరు జిల్లా 26వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న స్థానిక బీఆర్ స్టేడియం నుంచి కొత్తపేట విజయ టాకీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడే బహిరంగ సభ జరగనుండగా, ఇందులో వేలాది మంది కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొనాలని కోరారు. 18న మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో ప్రతినిధుల సభ జరుగుతుందని చెప్పారు. ఈ రెండు రోజుల సభల్లో ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావుతో సహా పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాసభల్లో పార్టీ పురోగతి, కార్మిక, కర్షక, ఉద్యోగ రంగ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, దేశ సంపదను -మిగతా 2 లో ...

ప్రజా సాంస్కృతికోద్యమ కేతనం పీవీ రమణ

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : 25 సంవత్సరాలుగా పాటే ప్రాణంగా జీవన గమనాన్ని సాగిస్తున్న ప్రజావాగ్గేయకారుడు పీవీ రమణ తెలుగు సాంస్కృతికోద్యమ జయకేతనమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సంస్కృతి(సంగీత, సాహిత్య, నృత్య, నాటక సంస్థ), అమరావతి ఉద్యమ సమితి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు పీవీ రమణ తన సమాజహిత పాటల ప్రస్థానం 25 సంవత్సరాలుగా సాగిస్తున్న సందర్భంగా స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయం కొరటాల సమావేశ మందిరంలో రమణ వెంకటలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు పీవీ మల్లికార్జునరావు సభకు అధ్యక్షత వహించగా వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ అమరావతి ఉద్యమం బలపడటంలో తన సంస్కృతిక దళం ద్వారా పీవీ రమణ ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రముఖ కవి జయరాజ్ మాట్లాడుతూ ఉద్యమాలకు ఊపిరిలూదేది ప్రజా కళాకారులేనన్నారు. ప్రజల హృదయాలను తన గానంతో తట్టి లేపిన ప్రజా గాయకుడు పీవీ రమణ అని ప్రశంసించారు. కార్యక్రమంలో సత్రరాజు బాలచందర్, డాక్టర్ పోలే ముత్యం, బాలస్వామి, విప్లవ కుమార్, నూతలపాటి కాళిదాసు, పలువురు కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు. పలువురు గాయకులు ఆలపించిన చైతన్య గీతాలు అలరించాయి.

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు 3వ స్నాతకోత్సవం, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవాన్ని ఆదివారం వర్సిటీ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రామ్‌కుమార్ కాకాని పాల్గొని ప్రసంగించారు. 7లో...

స్వచ్ఛ విజయవాడ సాధించుకుందాం

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలి
- ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించుకుందాం
- భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిద్దాం
- ఔత్సాహిక కళాకారులతో నృత్య ప్రదర్శన పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ : పర్యావరణ పరిరక్షణకై జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ వివిధ రూపాల్లో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. స్వచ్ఛ విజయవాడ సాధనలో భాగంగా జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హరిత బెరం పార్కులో సంప్రదాయ నృత్య పోటీలను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఔత్సాహిక నృత్య కళాకారులు తమ తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శిం చేందుకు ఇటువంటి వేదికలు దోహదపడతాయన్నారు. విజయవాడ నగరం ప్రతిభావంతులైన కళాకారులకు కేంద్రంగా ఉందన్నారు. సాంస్కృతిక, సాహిత్య, సామాజిక సేవ... ఏ రంగాన్ని తీసుకున్నా ప్రపంచ స్థాయిలో ఎంతోమంది నగరం నుంచి వారి ప్రస్థానం -మిగతా 2 లో ...

దోమలు బాబోయ్...

- దోమల బెడదతో అనారోగ్యాల పాలవుతున్న గుడివాడ ప్రజలు
- చర్యలు చేపట్టడంలో అధికారుల విఫలం

విశాలాంధ్ర-గుడివాడ : పట్టణంలో దోమల బెడద అధికమయింది. ప్రజలు దోమ కాటుకు విలవిల్లాడాల్సి వస్తోంది. సాయంత్రమైందంటే చాలు టీ స్టాల్స్ హోటల్స్ ఎక్కడ చూసినా జనం దోమలను తోలుకుంటూ దర్శనమిస్తున్నారు. దోమలు తమ విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూ ప్రజలను అనారోగ్యాల పాల్జేస్తున్నాయి. గుడివాడ పట్టణంలో రోజురోజుకు దోమల బెడద విపరీతంగా పెరగటంతో కంటిపై కునుకు కూడా రావటం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. దోమల నివారణకు ప్రజలు -మిగతా 2 లో ...

జర్నలిస్టుల కలం వెలుగులు పంచాలి

విశాలాంధ్ర-తెనాలి : జర్నలిస్టుల కలం దీపంలా ఉండి పదిమందికి వెలుగులు పంచాలని తెనాలి మండల తహశీల్దార్ ఏ.వి. గోపాలకృష్ణ అన్నారు. స్థానిక కొత్తపేటలోని శ్రీ తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియుడబ్ల్యూజె) తెనాలి నియోజకవర్గశాఖ సహకారంతో గుంటూరు జిల్లాలోని గ్రామీణ విలేకర్లకు రెండురోజుల పునశ్చరణ తరగతుల ముగింపు సమావేశం సందర్భంగా ఆదివారం సాయంత్రం జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అధ్యక్షత వహించగా ఏపియుడబ్ల్యూజె తెనాలి అధ్యక్షుడు చందు సుబ్బారావు సభను నిర్వహించారు. గోపాలకృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ జర్నలిస్టుల కలం అన్యాయాన్ని ఎదిరించే ఆయుధంగ పనిచేయాలన్నారు. పరిశోధన చేసి సమస్యలను వెలికితీసి వాటి పరిష్కారానికి కృషిచేసేదే అసలైన జర్నలిజం. జర్నలిస్టుల కలం నుండి జాలువారే వార్తలు, వ్యాసాలు పేదవాడికి ఉపయోగపడాలి. జర్నలిస్టుల మేధస్సు నుండి పుట్టిన ప్రతి ఆలోచన సమాజానికి ఉపయోగపడినప్పుడే జర్నలిస్టుల విలువ మరింత పెరుగుతుందని ఎమ్మార్వో గోపాలకృష్ణ అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిజం అంతిమ ప్రయోజనం ప్రజా ప్రయోజనం కావాలన్నారు. గుంటూరు జిల్లాలోని గ్రామీణ విలేకర్లకు రెండురోజుల పునశ్చరణ తరగతులను తొలిసారిగా -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

సీపీఐ గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేసుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు గుంటూరులో ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ఈ నెల 5న లిబర్టీ థియేటర్ ఎదురుగా ఉన్న విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా జరగనున్నదని, ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభల జయప్రదానికై గోడప్రచార పత్రికలు విడుదల చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, షేక్ వలి, జిల్లా సమితి సభ్యులు జంగాల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల కలం వెలుగులు పంచాలి

ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో తెనాలి విజయవంతంగా జరిగాయని ఈ స్ఫూర్తితో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇటువంటి పునశ్చరణ తరగతులను నిర్వహిస్తామని అన్నారు. ఏపీయుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు మాట్లాడుతూ ఒకప్పుడు రాష్ట్రంలో జర్నలిస్టులకు 23 వేలకు పైలికు గుర్తింపు కార్డులు ఉండేవని అవి 9 వేలకు పడిపోవడం శోచనీయమన్నారు. జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇస్తే బస్సుల్లో తిరగాలనేది మా అభిమతం కాదు. ఆర్యోగ్య బీమా కార్డులకు అర్హత పొందాలంటే కచ్చితంగా గుర్తింపు కార్డు అవసరం. గుర్తింపు కార్డులు ఇవ్వడానికి విధివిధానాలతో కూడిన జీ.వో.ను ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ ఇంకా ఆమోదించలేదు. అందువల్ల ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఏపీయుడబ్ల్యూజె ఆధ్వర్యంలో ఈ నెల 5వతేదీన జరగనున్న కార్యక్రమంలో సంఘ సభ్యులంతా పాల్గొని జర్నలిస్టుల హక్కుల సాధనకు మద్దతునివ్వాలని అన్నారు. ఇంకా జర్నలిస్టులకు గృహాలతో కూడిన స్థలాలు, బీహార్‌లో మాదిరిగా పెన్షన్ సౌకర్యం ఇత్యాది అనేక హక్కుల సాధనకై ప్రభుత్వంతో సంప్రదిస్తున్నట్లు ఐ.వి. సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయుడు బొల్లిముంత కృష్ణకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ కార్యదర్శి మణిరామ్, ఏపీయుడబ్ల్యూజె పూర్వ ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, రాష్ట్ర కార్యదర్శి విద్యాధర మురళి, ఏ.పి ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎన్. మీరా, కార్యదర్శి కె. రాంబాబు, గణేష్ యుత్‌కు చెందిన వీరవల్లి మురళి, సీనియర్ పాత్రికేయుడు బొల్లిముంత కృష్ణ తదితరులు ప్రసంగించారు. కార్యదర్శి ఎం. గోపీచంద్, మార్కొండేయులు, దీపాల సాయి, మురళీ, సుధాకర్, శరత్ పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమంలో శిక్షణపొందిన పాత్రికేయులందరికీ అకాడమీ సర్టిఫికెట్లను అందించింది. ఆదివారం జరిగిన శిక్షణా తరగతులు రెండు రోజులలో మొత్తం ఏడు అంశాలలో ఈ పునశ్చరణ తరగతులు జరిగాయి. కాగా ఆదివారం ఉదయం జరిగిన తరగతులలో ఆంధ్రజ్యోతి పశ్చిమగోదావరి జిల్లా ఎడిషన్ ఇన్‌చార్జ్ దేవగళ్ళ రామకృష్ణ 'విలేకర్ల నుంచి డెస్క్ ఏం కోరుకుంటుంది అనే అంశంపై ప్రసంగించగా, సీనియర్ పాత్రికేయుడు డి. సోమసుందర్ 'గ్రామీణ వార్తలు, కథనాలు అనే అంశంపై ప్రసంగించారు. తదుపరి ఆంధ్రజ్యోతి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ న్యూస్ ఎడిటర్ బి.హెచ్.వి. మంగేష్ 'పత్రికా భాష-మెళకువలు' అనే అంశంపై ప్రసంగించారు. భోజన విరామం అనంతరం జరిగిన కార్యక్రమంలో విశాలాంధ్ర వర్కింగ్ ఎడిటర్ అజయ్ 'స్మార్ట్ రిపోర్టింగ్' అనే అంశంపై ప్రసంగించారు. కాగా ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన గ్రామీణ విలేకర్లు ఈ పునశ్చరణ తరగతుల్లో పాల్గొన్నారు.

దోమలు బాబోయ్...

మస్కిటోకాయిల్, టార్టాయిస్, ఆల్అవుట్ వంటి పవర్‌ఫుల్ వాటిని ఉపయోగించినప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగా మారింది. గత 10 సంవత్సరాల నుండి ఎన్నడూ లేనివిధంగా దోమలు పట్టణ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా పట్టణంలో దోమలబారిన పడి అనేకమంది డెంగ్యూ, కలరా, మలేరియా తదితర ప్రాణాంతకరమైన వ్యాధుల బారిన పడి ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు.

డ్రైన్‌లను ఆక్రమిస్తూ అపార్టుమెంట్‌ల నిర్మాణం

పట్టణంలో విచ్చలవిడిగా అపార్ట్‌మెంట్ నిర్మాణాలు డ్రైనేజీలను సైతం ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించుకోవటంతో మురుగునీరు పారుదలకు తీవ్ర ఆటంకాలుగా మారాయి. దోమల నివారణకు పూర్తి చర్యలు చేపట్టి గుడివాడ పట్టణాన్ని దోమలు లేని పట్టణంగా తీర్చిదిద్దుతామని చెప్పిన మునిసిపల్ అధికారులు దోమల నివారణలో విఫలమయ్యింది. వర్షాకాలం మొదలు అయిన నాటి నుండి పట్టణంలో దోమలు విలయతాండవం చేస్తున్నాయి. రాత్రివేళల్లో పట్టణ వీధుల్లో ఉన్నవారికి దోమలను తోలుకునేందుకు రెండు చేతులు చాలడం లేదు. కాళ్ళు, చేతులు కదుపుతూ దోమలు కుట్టకుండా కాపాడుకునే ప్రయత్నాలు చేస్తూ ఎక్కడ రోగాల బారిన పడాల్సి వస్తుందో అని బెంబేలెత్తుతున్నారు. ఏ వీధిలో ఎన్ని సార్లు ఫాగింగ్ జరిగిందో మున్సిపల్ అధికారులు తెలిపాలి.

దోమల పెంపుకు దోహదపడుతున్న డ్రైన్‌లు..

పట్టణంలోని ప్రధాన డ్రైన్‌లతో పాటు అంతర్గత డ్రైన్‌లలోనూ పూడిక తొలగించకపోవటంతో ఎక్కడికక్కడే మురుగు మేటవేసుకు పోయింది. దీంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవటంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. పట్టణంలో నివాసగృహాల మధ్య ఉన్న ఖాళీస్థలాలలో మురుగునీరు చేరి దోమలు వ్యాప్తి చెందటానికి కారణమవుతున్నాయి. ఫాగింగ్, స్ప్రేయింగ్ సరిగా చేయకపోవడమే దోమల బెడదకు కారణంగా పలువురు పేర్కొంటున్నారు. అంతర్గత డ్రైనేజీ విషయానికొస్తే చింతలకాల్వ పూడిక తూతు మంత్రం ఉండడంతో సమీపంలోని మందపాడు, అరవపేట, పెదఎరుకపాడు, రైలుపేట తదితర ప్రాంతాలలో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు పురపాలక సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టి పట్టణ ప్రజలను అనారోగ్యాల బారిన పడకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ విజయవాడ సాధించుకుందాం

ప్రారంభించారని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణపై తరచుగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలలో అవగాహన పెరుగుతుందన్నారు. ఇప్పటికే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కొనసాగుతోందన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి హాని జరగడమే కాకుండా నగర ప్రజలు ఆరోగ్య సమస్యలు కూడా ఎదుర్కొంటారన్నారు. బాలబాలికల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తుల నిరోధంపై ప్రజలలో చైతన్యం పెంచేందుకు వివిధ కళారూపాలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా వరుసగా ఐదు ఆదివారాలు ఈ నృత్య పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో వయస్సుల వారీగా కళాకారులు తమ ప్రదర్శనలు ఇస్తున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం స్వచ్ఛ విజయవాడ సాధన కోసమేనన్నారు. ఐదవ ఆదివారం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ యస్. ఇల్మక్కియ, మేరీటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సామ్యవాద ఆదర్శాలకు నిలువెత్తు రూపం తరిమెల నాగిరెడ్డి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : భారత కమ్యూనిస్టు విప్లవకారుల నాయకుడు, పీడిత ప్రజల ప్రియతముడు,భారత ప్రజా యుద్ధ పంథా రూపొందించటంలో ప్రముఖ పాత్ర వహించిన అమరుడు తరిమెల్ల నాగిరెడ్డి అని పలువురు వ్యక్తులు కొనియాడారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సిపిఐ(ఎం-ఎల్) ఉమ్మడి కృష్ణా జిల్లా కమిటి ఆధ్వర్యంలో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 49వ వర్ధంతి సభ నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ భారత విప్లవ రాజకీయరంగంలో 35 ఏళ్లకు పైగా వెలుగొంది పీడిత ప్రజల హృదయాలలో ఆయన శాశ్వత స్థానం సంపాదించారన్నారు.1917లో అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో పుట్టారన్నారు.భూస్వామ్య కుటుంబంలో జన్మించినా దేశంలో కొనసాగుతున్న ఫ్యూడల్ దోపిడీ వ్యవస్థను భూస్థాపితం చేయటానికి, సమ సమాజ స్థాపనకు తన సర్వస్వాన్నీ అర్పించి దేశవ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందారన్నారు. సందర్భంగా పీడిత ప్రజల తరుపున విప్లవ జోహార్లు అర్పిస్తున్నామన్నారు.సభకు అధ్యక్షత వహించిన యు.వీరబాబు,మరీదు ప్రసాద్ బాబు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలన్నింటినీ భ్రష్టు పట్టించారు. దేశాన్ని ఈ రకంగా తాకట్టు పెట్టి, అమ్మేయడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారని 50 ఏళ్ల క్రితమే తరిమెల నాగిరెడ్డి విశ్లేషించి చెప్పారన్నారు.ఈ సభలో ఉల్లిగడ్డల నాగేశ్వరరావు,ఎమ్.వి.స్వామి,ఇతర నాయకులు పాల్గొన్నారు.

శాంతి, సౌభ్రాతృత్వం కోసం కమ్యూనిటీ కృషి

విశాలాంధ్ర-ఘంటసాల : భారతదేశంలో శాంతి, సౌభ్రాతృత్వం కోసం అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీ కృషి చేస్తుందని కమ్యూనిటీ నూరుల్ ఇస్లాం శాఖ ప్రజాసంబంధాల అధికారి ముహమ్మద్ జావిద్ అహ్మద్ పాషా తెలిపారు. ప్రపంచ శాంతి స్థాపన లక్ష్యంగా ఉమ్మడి కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా ఘంటసాల మండలాన్ని అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీ నూరుల్ ఇస్లాం శాఖ ప్రజాసంబంధాల అధికారి ముహమ్మద్ జావిద్ అహ్మద్ పాషా ఆదివారం విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న నేపథ్యంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం కోసం సమ్మేళనాలు, సెమినార్లు, చర్చాగోష్టులు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని మతాల గురువులను పరస్పరం గౌరవించినప్పుడే నిజమైన శాంతి సాధ్యమవుతుందన్నారు. జిల్లా మీడియా ప్రతినిధి ముహమ్మద్ యాకూబ్ పాషా మాట్లాడుతూ ఈ కమ్యూనిటీని 1889లో హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ (అ.స) ఖాదియాన్‌లో స్థాపించారని తెలిపారు. ఆయన ఇస్లాం ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా (స.అ.వ) చేసిన భవిష్యవాణి ప్రకారమే వాగ్దత్త మసీహ్‌గా ప్రకటించుకున్నారని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 200కిపైగా దేశాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్న ఈ కమ్యూనిటీ, “అందరిని ప్రేమించు, ఎవ్వరినీ ద్వేషించకు” అనే నినాదంతో “హ్యూమానిటీ ఫస్ట్” ద్వారా మానవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది అని అన్నారు. ప్రస్తుత ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ప్రపంచ పార్లమెంట్లలో ప్రసంగిస్తూ శాంతి సందేశం వ్యాపింపజేస్తున్నారని ఘంటసాల మసీదు గురువు ఇస్మాయిల్ అన్నారు. జిల్లా ఇంచార్జ్ మహమ్మద్ ఇస్మాయిల్, షేక్ ఖాసీం, షేక్ అక్బర్, నవాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వానికి తెలపండి

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్రంలో 29 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిమిత్తం వచ్చిన కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు బీసీ నేతల బృందాన్ని కలుపుకుని కలిశారు. ఈ సందర్భంగా మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో గడ్కరీకి శాలువా కప్పి, బొకేలు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఓబీసీల 13 ముఖ్య డిమాండ్లపై కేంద్రానికి తెలుపాల్సిందిగా విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. కేసన శంకరరావు మీడియాతో మాట్లాడుతూ జనగణనలో కుల గణనకు చట్టబద్ధత కల్పించాలని, చట్టసభల్లో ఓబీసీలకు జనాభా దామాషా మేరకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా కల్పించేలా చట్ట సవరణ చేయాలని, సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితిని రద్దు చేస్తూ పార్లమెంట్ చట్టం తేవాలని, రాష్ట్రాల రిజర్వేషన్ పెంపును షెడ్యూల్ 9లో చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, ఓబీసీ సబ్ ప్లాన్, ప్రత్యేక నోడల్ ఏజెన్సీ ద్వారా అమలు, మండల్ కమీషన్ సిఫారసుల అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రమోషన్లలో రిజర్వేషన్ వంటి అంశాలను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ అమరావతిని అనుసంధానించే ఐఆర్ఆర్, ఓఆర్ఆర్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని గడ్కరీని కోరినట్లు వెల్లడించారు.

రూ.50 లక్షల విలువైన 250 మొబైల్ ఫోన్‌ల రికవరీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : దొంగిలించబడిన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ సతీష్ కుమార్ బాధితులకు స్వయంగా అందజేశారు. మొత్తం రూ.50 లక్షల విలువ కలిగిన 250 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేయగా, ఇప్పటివరకు 3115 ఫోన్లను అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ ప్రతిఒక్కరి జీవితంలో విడదీయలేని భాగంగా మారిందన్నారు. సెల్‌ఫోన్ పోవడం వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు తమ ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా లేదా 8688831574 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే నేరుగా 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సెల్‌ఫోన్ల ద్వారా ఎక్కువగా ఆర్థిక లావాదేవీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. నకిలీ ఫోన్ కాల్స్ ద్వారా మోసాలు జరుగుతున్నందున అలాంటి కాల్స్‌కి భయపడకుండా వెంటనే బ్లాక్ చేసి, సమీప పోలీస్ స్టేషన్ లేదా 1930 నంబర్‌కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్ల రికవరీలో విశేషంగా కృషి చేసిన ఐటీ కోర్ సీఐ నిషార్ భాషా, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుళ్ళు శ్రీధర్, మానస, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

విశాలాంధ్ర-ఎ.కొండూరు : తిరువూరు విజయవాడ జాతీయ రహదారిపై ఎ.కొండూరు మండలం చీమలపాడులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం కేశ్యా తండాకు చెందిన బాణావతు సంధ్యా నాయక్ ఆదివారం తన కుమారుడు బాణావతు యశ్వంత్(6)ను వెంట పెట్టుకొని చీమలపాడు గ్రామానికి వెళ్లి రోడ్డు దాటుతుండగా తిరువూరు వైపు నుండి విజయవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంగా ఢీకొనడంతో ముక్కుపచ్చలారని బాణావత్ యశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-విజయవాడ: ఈ నెల 4వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంతో ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in. వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

అక్రమ పొగాకు వాణిజ్యాన్ని ఎదుర్కొనేందుకు జి2జి చర్చలు అవసరం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అక్రమ పొగాకు వాణిజ్యాన్ని ఎదుర్కొనేందుకు సోర్స్, ట్రాన్సిట్ దేశాలతో కొనసాగుతున్న జి2జి చర్చల అవసరాన్ని ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ (పీఎంఐ)లో అక్రమ వాణిజ్య నివారణ అధిపతి రోజ్బీ వాన్ డూరెన్ నొక్కి వక్కాణించారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన రెండు రోజుల ఏఎస్ఏఐ భద్రతా సదస్సు, ప్రదర్శనలో, నకిలీ నిరోధక, అక్రమ వాణిజ్యం, బ్రాండ్ రక్షణ గురించి ఆయన మాట్లాడుతూ చట్టాలను జారీ చేసే సంస్థలు, విధాన రూపకర్తలు, భద్రతా పరిష్కార ప్రదాతలు మరియు యజమానులతో సహా సదస్సుకు హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, అక్రమ పొగాకు ఉత్పత్తులు సప్లయ్ చెయిన్ వ్యాప్తంగా నియంత్రణ అంతరాలను, తప్పించుకునేందుకు అవకాశం ఉన్న మార్గాలను ఎలా వినియోగించుకుంటున్నాయో పూసగుచ్చినట్లు వివరించారు. ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించుకునేందుకు తక్షణ ప్రాధాన్యత, సంప్రదాయానికి అతీతంగా అంతర్-మంత్రిత్వ సమన్వయం అత్యవసరమని రోజ్బీ వాన్ డూరెన్ పేర్కొన్నారు.

హౌస్ ఆఫ్ మెక్ డోవెల్స్ సోడా యారీ జామ్ ప్రచారం

విశాలాంధ్ర -విజయవాడ : ఈ ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా, హౌస్ ఆఫ్ మెక్ డోవెల్స్ సోడా యారీని ఆకాశమే హద్దుగా కొత్త వేదికపై కొత్త ఎత్తులకు తీసుకెళ్తోంది. భారతదేశపు అతిపెద్ద బ్రాండెడ్ లైవ్ ఐపిగా, ట్రైబ్‌వైబ్ ఎంటర్టైన్మెంట్ తయారు చేసి, ప్రమోట్ చేసిన యారీ జామ్, 36,000 అడుగుల ఎత్తులో మొట్టమొదటి జామ్ తో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని గుర్తించింది, ఇక్కడ కింగ్, కర్మ కలిసి ఒక విమానాన్ని స్నేహం మరపురాని క్షణంగా మార్చారు. ఇప్పుడు, ఈ ప్రయాణంలో అధ్యాయం కోసం కోల్ కతా కి వస్తుంది. ఇంకా చెప్పాలంటే, హౌస్ ఆఫ్ మెక్ డోవెల్ సోడా ఎల్లప్పుడూ యారీని ప్రోత్సహించింది - ఇది కేవలం పనిలా మాత్రమే కాదు, ఒక భావోద్వేగంతో ఉంటుంది. యారీ జామ్ ప్రతి ఎడిషన్ తో, ఈ బ్రాండ్ ప్రతి ఒక్కరినీ కలిపే దాని ద్వారా స్నేహంలో ఉండే నిజమైన సంబంధాలను సంగీతంతో సెలెబ్రేట్ చేసుకోవడానికి తన నిబద్ధతను బలోపేతం చేస్తుంది.

ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడే బాదుడే

విశాలాంధ్ర-గన్నవరం : విద్యుత్ చార్జీలు నిలువు దోపిడీ కోటమీ ప్రభుత్వం వెంటనే ఆపాలని ప్రజా వేదిక నాయకులు కాట్రగడ్డ రామచంద్రజోషి ఎం ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గన్నవరం మండలం గొల్లపల్లి గ్రామంలో ప్రజా వేదిక ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి సంతకాల సేకరణ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో 9 సార్లు పెంచి విద్యుత్ ఛార్జీలు 9 వేల కోట్లు భారం మోపింది. చంద్రబాబునాయుడు కూటమీ ప్రభుత్వం ఎన్నికల్లో జగన్ ప్రభుత్వంలో బదుడే బాదుడనీ కరెంటు చార్జీలు పెంచమని హామీ ఇచ్చి అలానే స్మార్ట్ మీటర్లు రూపంలో ప్రజలపై విద్యుత్ చార్జీలు మోపేందుకు సిద్ధం చేశారని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచిటం వల్ల నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి ప్రజల పై భారాలు పడి ప్రజల జీవనాడి భారం అవుతుందని అన్నారు అదాని స్మార్ట్ మేటర్ పెట్టి విద్యుత్తును ప్రైవేటు పరం చేసేందుకు ప్రభుత్వాలు కుట్ర పండుతున్నాయని విమర్శించారు. విద్యుత్తు సంస్కరణల పేరుతో కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టి విద్యుత్తు నుండి ప్రభుత్వాలు వైదొలగటమేనని అన్నారు కోటమీ ప్రభుత్వం కుటమి స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ నెల 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ లో సచివాలయంలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో కట్టవరపు విజయరావు కట్టవరపు బెనర్జీ, చాగంటి పాటి వెంకటేశ్వరరావు, చాగంటిపాటి భవాని ప్రసాదు శేషగిరిరావు, కె శివాచారి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని విజయవాడ వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ అన్నారు. ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కుటుంబ పరిస్థితులు, జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. గతపంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారు మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. శాంతి భద్రతలకు, ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పీడీయాక్టు పెడతామన్నారు. చెడు ప్రవర్తన కలిగిన వారిని బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. వీరిపై పోలీసు నిఘా ఉంటుందన్నారు.

శ్రవణానందకరం చిత్ర గీతాల గానం

విశాలాంధ్ర-విజయవాడ : మహానటి ఎస్ఎస్ఎస్ కె ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహానటి సావిత్రి తరువాత అంత గుర్తింపు తెచ్చుకున్న నటిమణి వాణిశ్రీ పుట్టినరోజు సందర్భంగా హనుమంతరాయ గ్రంథాలయంలో ఆమె నటించిన చిత్రాల పాటలతో జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలకు స్వరాలను పల్లవింపజేసింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి నేతృత్వంలో రత్నకుమారి, కామేశ్వరి, శిరీష, విష్ణుప్రియ, మల్లీశ్వరి, మహేశ్వరి, డేవిడ్ రాజు, జయప్రభు, చంద్రశేఖర్, రాయరాజు, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాటలను మధురంగా ఆలపించి ఆకట్టుకున్నారు. వ్యాఖ్యాతగా అశోక్ ఆనంద్ వ్యవహరించగా అతిథులుగా ప్రసూన రామన్, జోషి, బివి వీరభద్రరావు, కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి దంపతులు తదితరులు మాట్లాడుతూ చలనచిత్ర రంగాన్ని వారి నటనతో సుగమం చేసిన ప్రముఖుల గొప్పతనాన్ని నేటి తరానికి గుర్తు చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థను కొనియాడారు.

కార్మిక సంఘం నేత మిక్కిలినేని కన్నుమూత

విశాలాంధ్ర-చల్లపల్లి : కార్మికసంఘం నేత, రైతు నాయకులు మిక్కిలినేని పాపారావు (92) శనివారం రాత్రి చల్లపల్లిలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. లక్ష్మీపురం చక్కెర కర్మాగారం కార్మిక సంఘ నేతగా కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటంచేసిన ఆయన ఆ తర్వాత రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. ఆయన కుమారుడు మిక్కిలినేని మధు టీడీపీ సీనియర్ నాయకునిగా ఉన్నారు.నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్‌లు ఆదివారం ఉదయం పాపారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కార్మికనేతగా, రైతునాయకునిగా వారి సేవలు స్మరించుకు న్నారు. తమ తండ్రి వెంకట కృష్ణారావుతో పాపారావుకున్న అనుబంధాన్ని బుద్ధప్రసాద్ గుర్తుచేసుకున్నారు. పాపారావు తనయుడు మధును పరామర్శించి సానుభూతిని తెలిపారు.

ప్రముఖుల నివాళులు : మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, సీపీఐ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మోర్లరాం బాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, డీసీ ఛైర్మన్లు నిడమానూరి దిలీప కుమార్, అయినపూడి భానుప్రకాష్, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, జడ్పీమాజీ వైస్‌ఛైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మాజీ ఎంపీపీ యార్లగడ్డ లంకబాబు, వైద్యప్రముఖులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ సబ్బినేని



భవానీప్రసాద్, డాక్టర్ ఎన్. కీర్తి, కూటమి నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, మండవ బాలవర్థిరావు, కోనేరు బలరాం, దోనేపూడి గోపీకృష్ణ, కొడాలి మురళి, రావి చిట్టి, మోర్ల శివ, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, అడపా రాంబాబు, వేమూరి రత్నగిరి, వీరమాచనేని భవానీ ప్రసాద్, ప్రముకులు పరుచూరి అంజయ్య, యార్లగడ్డ శివప్రసాద్, దుబ్బుల సాంబశివరావు, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, డాక్టర్ డి.శివప్రసాద్, మాలెంపాటి రంగారావు, నాదెళ్ల పూర్ణ, సబ్బినేని బోసు, కాట్రగడ్డ రామ్మోహనరావు, కెవిఆర్ఎస్.మిత్ర, తుమ్మల శ్రీను, వార్డు సభ్యులు మీర్ రిజ్వాన్, షేక్ సిలార్, ఆర్యవైశ్య సంఘ నేతలు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, యద్దనపూడి మధు, కేసీపీ జీఎం బల్లిపిచ్చియ్య, కార్మికసంఘ నేతలు తదితరులు పెద్దఎత్తున తరలివచ్చి పాపారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. చల్లపల్లి మునసబ్ వీధిలోని కుమారుడు మధు ఇంటి వద్ద నుంచి పాపారావు మృతదేహాన్ని ఊరేగింపుగా స్వగ్రామం దాలిపర్రు తీసుకువెళ్లి గ్రామస్థులు సందర్శనార్థం వ్యవసాయభూమిలో అంత్యక్రియలు నిర్వహించారు.

రైల్వేలకు సరుకు రవాణాతో ఆదాయం ఎక్కువ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రైల్వేకు ప్రధాన ఆదాయం సరుకు రవాణా ద్వారానే అధిక ఆదాయ్యం వస్తుందని దానిని మరింత ఎక్కువ రవాణా అయే విధంగా అధికారులు,సిబ్బంది తగిన చర్యలు తీసుకొవాలని డిఆర్ఎం మోహిత్ సోనాకియా సూచించారు. అదివారం ఆయన కాకినాడ ప్రాంతంలోని కీలకమైన రైల్వే మౌలిక సదుపాయాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో కాకినాడ టౌన్ స్టేషన్, కాకినాడ పోర్ట్ స్టేషన్ ,కాకినాడ సీపోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ (కెఎస్‌పిఎల్) ఉన్నాయి, వీటిలో సరుకు రవాణా నిర్వహణ, భద్రతా సంసిద్ధత సిబ్బంది సౌకర్యాలు వంటి వాటిపై విస్తృతమైన తనిఖిలు చేపట్టారు. ఇంటర్మీడియట్ ఓవర్‌హాల్ (10 హెచ్) షెడ్‌ను సమీక్షించారు, అక్కడ నిర్వహణ సిబ్బందితో మాట్లాడి,కోచ్ సర్వీసింగ్ కార్యకలాపాలలో భద్రతా చర్యలను పరిశీలించారు. రైలు కార్యకలాపాలు సజావుగా సాగడం ,ప్రయాణీకుల భద్రతను నిర్ధారించడంలో బ్యాకెండ్ జట్లు పోషించే కీలక పాత్ర భద్రత షెడ్లలోనే ప్రారంభమవుతుంద న్నారు.సాంకేతిక బృందాలు రక్షణలో మొదటి వరుసలో ఉంటూ ఖచ్చితత్వంతో అప్రమత్తగా ఉండాలన్నారు.కాకినాడలోని రన్నింగ్ రూమ్‌లో ఆపరేటింగ్ సిబ్బందికి విశ్రాంతి, రిఫ్రెష్మెంట్ సౌకర్యాలను సమీక్షించారు. సిబ్బంది సంక్షేమం అత్యంత ప్రాధాన్యతగా ఉంటుందని ఆయన సిబ్బందికి హామీ ఇచ్చారు.ముఖ్యంగా పరిశుభ్రత, పోషకాహారం,డిజిటల్ లాగ్‌బుక్ వ్యవస్థలలో సిబ్బంది సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. కార్యకలాపాలకు వెన్నెముకగా నిలిచే కష్టపడి పనిచేసే సిబ్బందిని అభినందించారు.

సరైన విశ్రాంతి, తగినంత సౌకర్యాలు ఉండేలా చూసుకోవడం కేవలం బాధ్యత మాత్రమే కాదు - ఇది కార్యాచరణ నైపుణ్యానికి అవసరం అన్నారు.కాకినాడ పోర్ట్ స్టేషన్ యార్డ్‌లో సరుకు రవాణా నిర్వహణ కార్యకలాపాలను, గూడ్స్ సైడింగ్‌లను, ప్రైవేట్ టెర్మినల్‌లతో ఇంటర్‌ఫేస్‌ను పరిశీలించారు. కాకినాడ సీపోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సమన్వయంతో యార్డ్ లేఅవుట్, షంటింగ్ నమూనాలు, వ్యాగన్ల ప్రవాహాన్ని ఆయన సమీక్షించారు.ప్రైవేట్ ఆపరేటర్లతో సమన్వయానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈయన వెంట డిఈఎన్ కో-అర్డినేషన్ వరుణ్‌బాబు, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ రాంబాబు వావిలపల్లి ఆపరేటింగ్, మెకానికల్, కమర్షియల్, సెక్యూరిటీ,సేఫ్టీ విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కూచిపూడి కార్యదర్శిగా ఈడే

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండలంలో ఐదు గ్రామపంచాయతీ కార్యాలయాలకు వేరే పంచాయతీ కార్యాలయాలలోని నలుగురు కార్యదర్శులకు అదనపు బాధ్యతలు కల్పిస్తూ డి.ఎల్.పి. ఓ.జి. సంపత్ కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కూచిపూడి గ్రామపంచాయతీ కార్యదర్శిగా మంత్రి పాలెం గ్రామపంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి ఈ.వి. హనుమాన్ గౌడ్‌ను నియమిస్తూ ఉయ్యూరుడి ఎల్‌పిఓ కూడా కొనసాగుతున్న గుడివాడ డిఎల్‌పి ఓలిఖితపూర్వకంగా ఆదేశించారు. ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి కె పుష్పనాదం జూన్ 30న పదవి విరమణ చేయడంతో గతనెల 5వ తేదీన మొవ్వపంచాయతీగ్రేడ్-1 కార్యదర్శి కె.వి సోమేశ్వరరావు (పూర్తి అదనపు బాధ్యతలు) ఎం.పీ.డీ.వో.దయాల సుహాసిని ఉత్తర్వుల మేరకు బాధ్యతలు చేపట్టారు. కాగా డిప్యూటీ ఎంపీడీవో (ఈవో పి ఆర్ డి) ఎం ఎస్ కె పరమాత్మ ఈనెల 20 వరకు సెలవులో ఉండటంతో ఈడే హనుమాన్ గౌడ్ ఇన్చార్జ్. ఈ.ఓ.పి.ఆర్.డిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

స్మార్ట్ మీటర్లు తక్షణమే నిలిపి చేయాలి

విశాలాంధ్ర-పెడన : ప్రజలపై భారాలు మోపే విద్యుత్ స్మార్ట్ మీటర్లను తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన పెడన సబ్ స్టేషన్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వాసా గంగాధర రావు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని బ్రహ్మపురం, వీరభద్రపురం ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రికలు పంపిణీ చేశారు. గంగాధరరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతుందన్నారు. రీఛార్జ్ అమౌంట్ అయిపోగానే విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రమాదం ఉందన్నారు. ఇది పేద మధ్యతరగతి వర్గాల పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత కార్మిక సంఘం కార్యదర్శి గోరు. రాజు, ఉట్ల. పేరయలింగం పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్లో ప్రవేశాలు కల్పించాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లను పరిశీలిస్తే కనీస సదుపాయాలు కూడా లేని పరిస్థితులు ఉన్నాయి వాటిని పరిశీలించటానికి అని ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్ర నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర నాయకులు కార్యకర్తలతో కలసి వెళ్ళటానికి ఈనెల 1న పిలుపు ఇచ్చామని దాంతో ప్రభుత్వం కంగారుపడి ప్రభుత్వ స్కూల్లో బయట వ్యక్తులు వెళ్లడానికి అనుమతి లేదు అని జీవో ఇవ్వటం అత్యంత దుర్మార్గామైన చర్యలు అని ఆప్ జోనల్ కన్వీనర్ నేతి మహేశ్వరరావు అగ్రహాం వ్యక్తం చేశారు. అదివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్కూల్లో పిల్లల చదువుకోడానికి క్లాసులు లేక వరండాల్లో కూర్చుని చదువుకునే పరిస్థితి అలాగే తాగునీటి సదుపాయం లేని పరిస్థితి బాత్రూంలో ఆడపిల్లలకి మగ పిల్లలకు కలిపి ఉన్న పరిస్థితి ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణము కోసుకు పిల్లలకు పెట్టే తిండి కూడా నేలకూరలతో ఉన్న పరిస్థితి పిల్లలని అడిగితే బయటి వాళ్లు చెబితే కేసు పెడతామని అక్కడ అధ్యాపకులు అంటున్నారు. ఇప్పటికైనా ఈ చీకటి జీవోనే తీసివేయాలి అని అలాగే గతంలో అమ్మబడి ఇప్పుడు తల్లికి వందనం అంటూ సుమారు 30 వేల కోట్లకు పైగా ఖర్చుపెట్టిన రెండు ప్రభుత్వాలు ఆడపిల్లలు మగ పిల్లలకు విడివిడిగా బాత్రూములు కూడా కట్టించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారు అంటే ఇది మీ ప్రచారానికి జరుగుతున్న వాస్తవానికి ఉన్న వ్యత్యాశమన్నారు.ఒకవైపు ప్రవేట్ స్కూల్లో ఫీజులు కనీసం 40 వేలు ఉంటే ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా ఇస్తున్నది 15000 అంటే పేదవాడు ప్రైవేటు స్కూల్లో చదవలేదు అలాగని ప్రభుత్వ మురికి స్కూల్లో సర్వే పరిస్థితి లేకపోవడంతో రాష్ట్రంలో అక్షరాస్యత శాతం రోజురోజుకీ పడిపోతున్న పరిస్థితి ఇంకా చెప్పాలంటే దేశంలోనే అట్టడుగును ఉన్న పరిస్థితి ప్రభుత్వ స్కూల్ మూతపడుతున్న పరిస్థితి ఈ మొత్తం కొట్రకు కారణం పేదవాడికి విద్య లేకుండా చేసి పేద యువకులకు మద్యం అలవాటు చేసి వర్గ పోరు సృష్టించి రాచరికాన్ని తలపిస్తున్న అరాచక విధానంతో ముందుకు వెళ్లడమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ నాయకులు పర్వతనేని హరికృష్ణ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల్లో కొరవడిన సిబ్బంది స్పందన

విశాలాంధ్ర-కూచిపూడి : ఈనెల 1వ తేదీ నుంచి ఏడో తారీఖు వరకు వారం రోజులు పాటు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించాల్సిన కార్యక్రమానికి అంగన్వాడీ సిబ్బందిడుమ్మా కొట్టారు. ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహించే వారోత్సవాల్లో వారం రోజులలో ఆదివారం సైతం కార్యక్రమాలు నిర్వహించాలన్నదిబహిరంగ రహస్యమే!!. ప్రభుత్వం నిర్వహించే పలు శాఖల వారోత్సవాలలో ఈ సాంప్రదాయం కొనసాగుతూ ఉంటుంది. అయితే అంగన్వాడీ కార్యకర్తలు మాత్రంఆదివారంవారాంతపు శలవనే సాకుతో వారోత్సవాల్లో మూడవరోజు (ఆదివారం) నిర్వహించాల్సిన గృహ సందర్శన కార్యక్రమాన్ని పలువురు నాగా పెట్టారు. అయితే ఇదే సమయంలోచెదరుమదురుగా కొంతమంది తమ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అధికారులకు సమాచారం అందించారు. దీనిలో భాగంగానే మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో కొనసాగిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు గృహ సందర్శన తోపాటు తల్లులకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిపాల ప్రాముఖ్యతపైవివరించినట్లు సమాచారం!!

అదనపు బాధ్యతలపై కార్యదర్శుల ఆందోళన

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వమండలంలోని మేజర్ పంచాయతీలో ఆరు పంచాయతీలకు పూర్తి అదనపు బాధ్యతలతో కార్యదర్శులను నియమించడంపై కార్యదర్శులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము రెగ్యులర్ పంచాయతీలలోనే వర్కులోడుతో సతమతమవు తుంటే యదనపు బాధ్యతలభారాన్ని మోయలేమని వాపోతున్నారు. మొవ్వ మండలంలో 11మేజర్ గ్రామ పంచాయతీలలో ఆరు పంచాయితీలకు కార్యదర్శుల కొరత పట్టిపీడిస్తోంది. నిడుమోలు, పెదముత్తేవి, కూచిపూడి, పెదపూడి,భట్ల పెనుమర్రు,అయ్యంకి గ్రామపంచాయతీలలో రెగ్యులర్ కార్యదర్శులులేకపోవడంతో అధికారులు సర్దుబాటు చర్య చేపట్టారు. దీనితో వారందరూ విముఖతవ్యక్తపరుస్తూ ఎఫ్ ఏ సి పోస్టులలో చేరాలేమని యూనియన్ల ద్వారా తమ ప్రయత్నాలు తాముచేసుకుంటున్నట్లు వినికిడి. ఈపంచాయతీలలో కొన్నింట్లోనెలల తరబడి ఖాళీగా ఉంటే మరికొన్ని పంచాయతీలుసంవత్సరంకు పైగాఖాళీలుగా ఉన్నాయి. అంతే కాకుండా ఆ కార్యదర్శులకు ఎఫ్ ఏసి పంచాయతీలు దూర భారం కూడా అవటంతో తమ యూనియన్ ద్వారా తమ ప్రయత్నాలలో తలమునకలై ఉన్నట్లు సమాచారం. వీళ్ళలో ఒకరిద్దరికి మూడు పంచాయతీల వరకు కూడా కేటాయించినట్లు సమాచారం.!! ఇదిలాఉండగా పని భారం పెరిగి అధికారుల మానసిక ఒత్తిడి, రాజకీయ ఒత్తిడి తట్టుకోలేక, డిప్రెషన్ కి లోనైమండలంలోని ఒక మేజర్ పంచాయతీ కార్యదర్శి దీర్ఘకాలిక సెలవు పై వెళ్ళిన సంగతి బహిరంగ రహస్యం. వీరిలో కొంతమంది పదవీ విరమణకు దగ్గరగా సుమారు మూడు నాలుగు సంవత్సరాలకు చేరటంతో వయసు రీత్యా ఆరోగ్య పరిస్థితి కూడా అంతంత మాత్రంగా ఉండటంతో అదనపు బాధ్యతలుమోయలేమని స్పష్టంగా పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. వీటన్నిటిని పరిగణ లోకి తీసుకొని జిల్లా, డివిజనల్ అధికారులు పూర్తి అదనపు బాధ్యతలు పోస్టులపై దృష్టి సారించి న్యాయం చేయాలంటూ కార్యదర్శులు, యూనియన్లు కోరుతున్నాయి

ముగిసిన గంగానమ్మజాతర

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం భట్ల పెనుమర్రు గ్రామ శివారు మల్లికార్జునపురంలో గ్రామదేవత గంగానమ్మ తల్లివార్షిక సంబరాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాల విన్యాసాల నడుమ108 జలబిందలతో అభిషేకాలు నిర్వహించారు. అలాగేపోతురాజుగడ, ఘటం తో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి ముందు వారు పోసి స్వాగతం పలికి హారతులతో నీరాజనాలు అర్పించారు. అనంతరం తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.

నిబంధనలు పాటించని నిర్మాణాలను ఉపేక్షించం

నోటీసులిచ్చి కూల్చివేయండి
నగర కమిషనర్ ఆదేశం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార నిర్మాణాలను నోటీసులు ఇచ్చి కూల్చి వేయాలని, నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ లేకుండా, నిబంధనలు పాటించకుండా జరుగుతున్న నిర్మాణాలను ఉపేక్షించబోమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. స్థానిక అరండల్‌పేట, గుంటూరువారితోట ప్రాంతాల్లో అనధికార కట్టడాలు, బ్రాడీపేట, పట్టాభిపురం మెయిన్ రోడ్, జేకేసీ కాలేజి రోడ్ ప్రాంతాల్లో రోడ్, డ్రైన్ ఆక్రమణలపై తీసుకోవాల్సిన చర్యలపై పట్టణ ప్రణాళికాధికారులకు ఆదివారం తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జీఎంసీ నుంచి నిర్దేశిత భవన నిర్మాణ ప్లాన్ తీసుకోకుండా లేదా ప్లాన్‌కి భిన్నంగా నిర్మాణాలు చేస్తే పట్టణ ప్రణాళిక అధికారులు సదరు నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి, చట్ట ప్రకారం కూల్చి వేయాలన్నారు. అరండల్‌పేట, గుంటూరువారితోట ప్రాంతాల్లో అనధికార కట్టడాలను గమనించి పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ ప్లాన్ మంజూరుకు అనేక నిబంధనలను సరళతరం చేసినప్పటికీ ప్లాన్ తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉండే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సచివాలయం పరిధిలో అనధికార, అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే పర్యవేక్షణ చేయాల్సిన సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసి, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శంకర్ విలాస్ వంతెన పనులు దృష్ట్యా ఈ నెల 9 నుంచి ప్రస్తుతం ఉన్న వంతెన కూల్చివేత పనులు ప్రారంభం కానున్న నేపధ్యంలో ట్రాఫిక్ ప్రత్యామ్నాయంగా ఉన్న రోడ్లు, డ్రైన్ల ఆక్రమణ తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆక్రమణల తొలగింపు వాహనాలు రాత్రి సమయాల్లో కూడా వార్డుల వారీగా మెయిన్ రోడ్లపై పర్యటించి, ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాల మంజూరు చేయాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండలానికి చెందిన చిలువూరు గ్రామంలో మాదిగ పల్లెకు ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. శతాబ్దకాలంగా విద్యాబుద్ధులు నేర్పిన ఆర్సీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఈ విద్యాసంవత్సరం మూతపడటంతో వందలాది మంది పేద పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకమైందని పేర్కొన్నారు. తల్లి దండ్రులు దూర ప్రాంతాల్లో స్కూళ్లలో చేర్పించాలంటే భారం మోస్తున్నారని, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల ఫీజులు చెల్లించలేక నాణ్యమైన విద్యా అవకాశం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1500 పైగా ఓటింగ్, 3000 జనాభా ఉన్న మాదిగ పల్లెలో ప్రభుత్వ పాఠశాల అవసరం అత్యవసరమని గుర్తుచేశారు. విద్యా హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న అధికారులపై ఏపీ హైకోర్టు, బాలల హక్కుల కమీషన్, హ్యూమన్ రైట్స్ కమీషన్, ఎస్సీ కమీషన్‌లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్వే నిర్వహించి మాదిగ పల్లెకు ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యాస ఫౌండేషన్ చైర్మన్ చిలువూరు ప్రసాద్, రామగిరి రాజు, మల్లవరపు డేవిడ్, గోచిపత ఆదిత్య, పౌలు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఈ నెల 4వ తేదిన ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని చెప్పారు.

పొన్నూరులో రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణం జీబీసీ రోడ్డులోని శ్రీ భావనారాయణ స్వామి ఆలయం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును కూటమి నాయకులు శుక్రవారం అందజేశారు. ఉండవల్లి గ్రామానికి చెందిన నందిపాముల సునీతకు మంజూరైన రూ. 22,655లు విలువైన చెక్కును ఇంటికి వెళ్లి అందజేశారు. చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు సునీత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు దాసరి కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు వంగా నరేంద్ర, ఉండవల్లి గ్రామ జనసేన అధ్యక్షులు రాజా రమేష్, ఉండవల్లి గ్రామ ప్రధాన కార్యదర్శి సంకరు ప్రశాంత్, గాదె బసి రెడ్డి, వల్లభాపురం శంకర్, భార్గవ్, చైతన్య, లామ్ నరేష్, సంకురు శివాజీ, సునీల్, నందా, పులి సతీష్ పాల్గొన్నారు.

రేపటి ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మంగళగిరి : అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ మంగళగిరి పట్టణంలోని ద్వారకా నగర్ నాలుగవ వార్డులో సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడం వలన విద్యుత్ వినియోగదారులపై అదనంగా భారం పెరుగుతుందని స్మార్ట్ మీటర్లను బిగించవద్దని ఆయన డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వలన సెల్‌ఫోన్ మాదిరిగానే రీఛార్జ్ చేసుకోవాలని దాని వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని ఆయన అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ ఈ నెల 5వ తేదిన విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన కోరారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో నాలుగో వార్డు శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, కోడూరు శివాజీ, పేరుపోయిన ముక్కంటి, బాపనపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ చెక్కు అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి : ఇస్లాం పేటకు చెందిన షేక్ అబ్దుల్ గఫార్ శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 35 వేలు మంజూరు కాగా ఆ మంజూరు పత్రాన్ని గఫార్‌కు అందజేశారు. మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ ఇబ్రహీం, 13వ వార్డు అధ్యక్షుడు షేక్ అమీర్, ప్రధాన కార్యదర్శి షేక్ అన్వర్ భాష, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వంగర హనుమాన్, తోట గౌరీ శంకర్, వార్డు కమిటీ సభ్యులు మొగల్ కరీముల్లా బేగ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం

విశాలాంధ్ర-మంగళగిరి : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) 2025-2028 కాలానికి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయింది. ఎన్నికలు ఈ నెల 16న జరగనున్న నేపథ్యంలో మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంలో ఆదివారం నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుత ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ తరపున కర్నూల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.గోవింద రెడ్డి అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. కార్యదర్శి పదవికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ పదవికి బండారు నరసింహారావు, ట్రెజరర్ పదవికి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ పదవికి దండు గౌర్ విష్ణు తేజ్ నామినేషన్ వేశారు. జాయింట్ సెక్రటరీ పదవికి ఇద్దరు అభ్యర్థులు బి.విజయ్ కుమార్, బి.శ్రీనివాసరాజు నామినేషన్లు వేశారు. నామినేషన్ ఉపసంహరణకు చివరి తేదీ ఆగస్టు 11, ఎన్నికల ఫలితాలు ఆగస్టు 16న వెలువడనున్నాయి.

స్నేహితుల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్నేహితులు లేనివారు ఉండరని, ప్రతి అడుగులోనూ ప్రోత్సహిస్తూ.. ఆనందంలోనూ.. బాధలోనూ వెంటనడిచే వారే స్నేహితులని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఎస్ఐఎస్ఎస్ కార్యాలయంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాళహస్తి మార్కెటింగ్ జేడీ రాజశేఖర్‌తో కలిసి కేక్ కట్ చేశారు. కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ స్నేహం యుగ యుగాలుగా ఉంటుందని, ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. స్నేహ బంధం ఎప్పటికీ విడిపోకుండా కలకాలం ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నవ్వులు, కన్నీళ్లు, ఆనందాలు, బాధలు అన్నింటినీ పంచుకునే వారే స్నేహితులని, స్నేహితులతో గడిపిన ప్రతి క్షణం ఒక జ్ఞాపకం లాంటిదని అన్నారు.

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులపై 'అపుస్మ' హర్షం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్రంలోని వేలాది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చిరకాలంగా ఎదురుచూస్తున్న సమస్యలపై క్యాంపస్ ప్రొటెక్షన్ యాక్ట్ జీఓ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు విడుదల చేసిన జీఓ ఆర్సీ నెంబర్ 30/67/2025 ఏ అండ్ ఎల్డి డేట్ 2025 ఆగస్టు 1 పట్ల ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) రాష్ట్ర అధ్యక్షులు కొలసాని తులసి విష్ణు ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ స్మార్ట్ స్కూల్‌లో ప్రభుత్వ జీఓ కాపీల ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యాలకు అకారణంగా బయట వ్యక్తుల నుంచి, కొంతమంది తల్లి దండ్రుల నుంచి అనేక ఒత్తిళ్లు దౌర్జన్యాలు ఎదు ర్కోవటం పరిపాటిగా మారేదన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీఓ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల ప్రాంగణాలలో ఎటువంటి రాజకీయ గుర్తులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన వస్తువులు, జెండాలు, శాలువాలు, కరపత్రాలు, ప్రదర్శనలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. అలాగే పాఠశాల ఆవరణలో వాంఛనీయ సమూహాలు వ్యక్తులు వివిధ సంఘాల పేరుతో ప్రవేశించి విద్యార్థినులను, ఉపాధ్యాయులను, పాఠశాలల, కళాశాలల నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేయటం, విధ్వంసాలకు దిగటం, భౌతికదాడులు చేయటం చట్టరీత్యా నేరమని, శిక్షార్హులు అవుతారని తెలియజేశారు. ఈ సమావేశంలో అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.మస్తాన్ రావు, అడిషనల్ ట్రెజరర్ కాటూరి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు నాయుడు చక్రనాగ్, నగర అధ్యక్షులు కన్నా మాస్టర్, జిల్లా కోశాధికారి ఎస్.సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడారి ఓడ పుస్తక పరిచయ సాహిత్య సభ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికపై ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత పలకలూరి శివరావు రచించిన ఎడారి ఓడ వజ్రోత్సవ జ్ఞాపిక పుస్తక పరిచయ సాహిత్య సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి గంటా మనోహర్ రెడ్డి, విశిష్ట అతిథిగా డాక్టర్ రావి రంగారావు, గౌరవ అతిథిగా విమల, డాక్టర్ జెల్ది విద్యాధర్, రచయిత ఏ.శ్రీనివాసరావు, సంఘ సేవకులు బత్తుల మురళి, ప్రముఖ రచయిత్రి తాటి కోకిల పద్మావతి, రచయిత సయ్యద్ జానీ బాషా, తుళ్లూరు సూరిబాబు, బలరాం, పలువురు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. వినుకొండ నియోజకవర్గం 100% ఇంటింటికి తిరిగి సర్వే పూర్తిచేసి ఎంతో కష్టపడి కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రంలో వినుకొండను 7వ స్థానంలో నిలిపిన టిడిపి నాయకులకు, క్లస్టర్ ఇన్చార్జులకు, యూనిట్ ఇన్చార్జులకు, బూత్ ఇన్చార్జులకు, గ్రామ పార్టీ అధ్యక్షులకు, కార్యకర్తలకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు, పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేస్తూ వినుకొండ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి. నెలరోజుల పాటు అందరూ బాగా కష్టపడి పనిచేశారని, పార్టీ అభ్యున్నతి కోసం పనిచేస్తున్న టిడిపి శ్రేణులకు తాను 24/7 నీకు అందుబాటులో ఉంటానని జీవీ అన్నారు.

గుర్రం జాషువా లా చాంబర్స్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - వినుకొండ : ఆదివారం వినుకొండలో న్యాయవాదులు అప్పరాజు అపర్ణాదేవి, పరిశపోగు, రాహుల్ అంబేద్కర్, కాకాని నాగేశ్వరరావు గుర్రం జాషువా లా చాంబర్స్ అనే అడ్వకేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సీనియర్ న్యాయవాది డొక్కా మాణిక్యవరప్రసాద్ హాజరై న్యాయవాదుల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మహాకవి గుర్రం జాషువా పేరుతో అడ్వకేట్ ఆఫీస్ వినుకొండలో ప్రారంభించడం చాలా మంచి పరిణామం అని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం అందరూ చదివి దాని అర్థం చేసుకొని వాటి యొక్క ఫలితాలను పొందాలని అన్నారు. అంతేకాక మనుషులందరూ కుల మతాలకు అతీతంగా అందరూ ఒకే పూర్వీకుల నుంచి జన్మించారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు, పొట్లూరి సైదారావు, సిహెచ్ఎల్ ఎన్ మూర్తి, కాపూరి గోపినాథ్, చాగంటి వీరాంజనేయ చౌదరి, దుగ్గపోగువిజయ్, ధూపాటి విజయ్, ముప్పాళ్ళ జ్ఞానేశ్వర రావు, తదితర వినుకొండ బార్ న్యాయవాదులు హాజరయ్యారు. విశ్రాంత డిఐజి స్టాంప్స్ బాలస్వామి, జడ్జీ కో ఆప్షన్ మెంబర్ గుండాల స్వెనోం, సంద్రపాటి సైదా, మారుతీ వరప్రసాద్ మహిళా న్యాయవాది రెడ్డి నాగ పద్మ, మరియు వినుకొండ పట్టణంలోని ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అడ్వకేట్ ఆఫీస్ ప్రారంభించిన న్యాయవాదులకు అభినందనలు తెలియజేసి చట్టపరంగా న్యాయపరంగా బాధితులకు అండగా నిలవాలని కోరారు.

కన్యకాపరమేశ్వరి, దుర్గాదేవికి సారె సమర్పణ

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గిలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి, దుర్గాదేవిలకు సారెను ఆర్య వైశ్య మహిళలు సమర్పించారు. శ్రావణమాసంను పురస్కరించుకొని ఆదివారం ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణ ద్వారా మా జీవితాలలో వెలుగులు నింపాలని వేడు కున్నారు. సిరి సంపదలతో వర్ధిల్లాలి, ఆరోగ్యవంతమైన జీవితంను ప్రసాదించాలని మొక్కుకున్నారు. తల్లి దీవెనలు పొంది కలకాలం ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆర్య వైశ్య మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల యోగాభ్యాసం

విశాలాంధ్ర-దాచేపల్లి : స్నేహితుల దినోత్సవంలో భాగంగా ఆదివారం నారాయణపురంలోని యోగ విజ్ఞాన కేంద్రంలో పదో తరగతి లోపు విద్యార్థులు యోగ చేశారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ యోగ చేసే విధానం, దాని వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమాలను బొడ్డు నాగేశ్వరరావు, యర్రంశెట్టి గోపీనాథ్ తదితరులు పర్యవేక్షించారు.

జగన్ కుట్ర రాజకీయాలను సహించం

విశాలాంధ్ర-నాదెండ్ల: గత పాలకులు చేతగాని నిర్ణయాలతో గ్రామాలను అభివృద్ధికి దూరం చేశారని, అలాంటి వారిని ఊళ్లలోకి రాకుండా ప్రజలు తరిమికొట్టాలని, సిగ్గులేకుండా ఇంకా ప్రజల ముందుకు వచ్చి తామేదో చేసినట్లు బూటకపు మాటలు మాట్లాడుతున్నారని మాజీమంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గణపవరం, కొమరవల్లిపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంస్థ సొసైటీల నూతన ఛైర్మన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గణపవరం సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పెంట్యాల శేషయ్యను, కొమరవల్లిపాడు సొసైటీ ఛైర్మన్ కోడె హనుమంతురావులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. అనంతరం బహిరంగ సభలో గ్రామస్తులు.. సొసైటీ కార్యవర్గ సభ్యులు, రైతుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు. గత ఐదేళ్లు వైసీపీ నేతలు ప్రజలకు ఉపయోగపడే బ్యాంకుల్ని కూడా మోసగించి, ప్రజల సొమ్ము కాజేశారని ప్రత్తిపాటి చెప్పారు. జగన్ చేసిన తప్పులు, మోసాలు.. ఆయన పార్టీ నేతల దుర్మార్గాల వల్ల జరిగిన నష్టం ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రైవేట్ బ్యాంకులు బయట సంస్థలని... కోఆపరేటివ్ బ్యాంకులు సొంతింటి లాంటివని .. అలాంటి సహకార సొసైటీల సేవల్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. కొమరవల్లిపాడు సొసైటీలో 29వేలకు పైగా సభ్యులున్నారని, రూ.7కోట్లకు పైగా పంటరుణాలు మంజూరు చేశారని, రూ.12కోట్లవరకు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చారని ప్రత్తిపాటి చెప్పారు. నూతన బ్యాంక్ భవనం నిర్మించేవరకు, ప్రస్తుతం ఉన్న అద్దె భవనాన్నే సొసైటీ కార్యవర్గం వినియోగించుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. జగన్ అరాచకాలను, కుట్ర రాజకీయాలను సహించే స్థితిలో కూటమి

సొసైటీ ఛైర్మన్ల ప్రమాణస్వీకారంలో ప్రత్తిపాటి

ప్రభుత్వం లేదన్న ప్రత్తిపాటి. చంద్రబాబు వైసీపీ దుర్మార్గాలను ఉపేక్షించరని ప్రత్తిపాటి తేల్చి చెప్పారు. వైసీపీ సానుభూతిపరులు కూడా తమ బిడ్డల భవిష్యత్ కోసం చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, బీజేపీ నాయకులు జయరామి రెడ్డి, నాదెండ్ల మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, రూరల్ మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, గంగా శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల రమణ, సొసైటీ ఛైర్మన్లు నల్లమోతు హరిబాబు, జిల్లా రైతు అధ్యక్షులు వీర రెడ్డి, అంబటి సాంబాబు, మద్దుమాల రవి, కెల్లంపల్లి ఆచయ్య, వలేటి హిమవంతరావు, జాన్ పాల్, గాలి బుచ్చయ్య , లీలా కృష్ణ, డైరెక్టర్ పూర్ణే హనుమంతరావు, యమర్తి ధర్మారావు, కోడె మణి, బొప్పుడి చంద్ర, గంజి శ్రీనివాసరావు, గొట్టిపాటి బాబు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆగమేఘాలమీద నిషేధాజ్ఞలు ఎందుకు

విశాలాంధ్ర-మాచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ నాయకులకు ప్రవేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద నిషేధాజ్ఞలు విధించి జీవో జారీ చేయడం ఏమిటని ఆమ్ ఆద్మీ పార్టీ పల్నాడు జిల్లా కన్వీనర్ పులిమల రూబెన్ ప్రశ్నించారు. సోమవారం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని జాతీయ స్థాయిలో ఆమ్ ఆద్మీ పార్టీ సర్క్యులర్ జారీ చేశారని, ఇందులో భాగంగా పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న లోపాలను గుర్తించి సరి చేయవలసిన బాధ్యత గల ప్రజాప్రతినిధులకు కూడా అవకాశం లేకుండా చేశారన్నారు. ఇల్లిల్లు తిరిగి మంచి ప్రభుత్వం అని చెబుతున్న కూటమి ప్రభుత్వం తమ విద్యా విధానాలను తామే వలంటీర్‌గా చూపించాల్సింది పోయి చూడాలనుకున్న వారిని రానివ్వొద్దంటు నిషేధాజ్ఞలు జారీ చేయడం ఎంతవరకు సమంజసమో పాఠశాలల డైరెక్టర్ విజయరామ రాజు తెలియజేయాలని కోరారు. వాస్తవంగా విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. త్రాగడానికి మంచినీటి సదుపాయం లేని పాఠశాలలు పశ్చిమ పల్నాడు ప్రాంతంలో చాలానే ఉన్నాయని,
గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేయబడ్డ ఆర్ఓ వాటర్ ప్లాంట్లు పనిచెయ్యక మూలన పడివున్నాయని, అక్కడ నీటి అవసరాలు పాఠశాల సిబ్బందే చూసుకోవలసిన పరిస్థితి దాపురించిందన్నారు.
ఎవరినీ పాఠశాల సందర్శనకు అనుమతించకుండా నిరాకరించే శక్తి మీకున్నప్పుడు విద్యార్థుల హక్కుల పరిరక్షణతో పాటు వారికి సకల సౌకర్యాలు సమకూర్చే బాధ్యత కూడ మీపై ఉందన్న విషయం మర్చిపోకూడదని అన్నారు.
పాఠశాల లోపల మీరు ఆంక్షలు విధించగలరేమో గానీ బయట మీవల్ల కానీ పనన్నది ఎంత నిజమో లోపలి విషయాలు ఎలాగైనా బయటకు తెలుస్తాయన్నది కూడా అంతే నిజమని అన్నారు.
కనుక మీరు దాచాలనుకున్నదేది దాగదు. సామాన్య ప్రజల బిడ్డల పట్ల శ్రద్ధ వహించి అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యాబోధన జరిగే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని రూబెన్ డిమాండ్ చేశారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి వినతి

విశాలాంధ్ర-రెంటచింతల : రైల్వేస్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు వినతి పత్రం అందజేసినట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లెర్ల కేశవరెడ్డి తెలిపారు. మాచర్ల-గుంటూరు ప్యాసింజరు రైలుకు బోగీలు తక్కువగా ఉన్నాయి. మాచర్లలోనే ప్రయాణికులు అధికంగా ఎక్కుతున్నారు. రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి ప్రయాణీకులు సీట్లు లేకనే కిక్కిరిసిన బోగీలలో నిలబడాల్సిందే. బోగీలు, బాత్‌రూమ్‌లు కొరతతో మహిళలు, చిన్నారులు ఇక్కట్లు పడుతున్నారు. స్టేషన్ ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్లు లేవు. డ్యాం నిర్మాణ సమయాలలో నాగార్జునసాగర్ వరకు రైలు సౌకర్యం ఉంది. త్వరలో పునరుద్ధరించాలని వినతిలో పేర్కొన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీరి వెంట నారాయణపురం శ్రీనివాసరావు ఉన్నారు.

వరుణదేవా... కరుణించవా...

పోలేరమ్మకు బోనాలు సమర్పించిన భక్తులు

విశాలాంధ్ర-రెంటచింతల : మండలంలోని రెంటాల గ్రామంలో భక్తులు వరుణ దేవా... కరుణించవా అంటూ ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా ప్రతి రోజు ఆకాశం మేఘావృతమై ఉంటూ పంటలను సాగు చేసుకునేందుకు సరిపడ వర్షం పడకపోవడంతో గ్రామ పెద్దలు పోలేరమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించాలని తీర్మానించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఆలయ ప్రధాన అర్చకులు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పెద్దసంఖ్యలో భక్తులు బోనాలతో గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహిస్తూ వర్షాలు సకాలంలో కురిసి పైరు పంటలు సంవృద్ధిగా పండి, రైతన్నలలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించి పోలేరమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.

మాదాసు భానుప్రసాద్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణ పోలీస్ స్టేషన్‌లో హొంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న హొంగార్డ్ శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం లోక్ సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భాను ప్రసాద్ చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్ చేతుల మీదుగా రూ.25వేల డిమాండ్ డ్రాఫ్టును అందించారు. పట్టణంలోని పండరీపురం లోనున్న హొంగార్డు శ్రీనివాసరావు స్వగృహంలో సీఐ రమేష్, అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్, విలేకరి నార్నే బాబ్జి రావు సందర్శించి ఆరోగ్యం గురించి తెలుసుకొని వైద్య ఖర్చులు నిమిత్తం డి.డి.ని అందజేశారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ సురేష్ మాట్లాడుతూ భాను ప్రసాద్ మిత్ర బృందం చేస్తున్న సేవలను అభినందించారు. గతంలో రెండు పర్యాయాలు ప్రకృతి వైపరీత్యం వల్ల కేరళ రాష్ట్రంలో అపారమైన ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగినప్పుడు కూడా చిలకలూరిపేట నుంచి భాను ప్రసాద్ మిత్ర బృందం విరాళాలను అందించారని సీఐ గుర్తు చేశారు.
వాట్సాప్ గ్రూప్ ద్వారా ఇచ్చిన పిలుపునందుకొని తమ వంతు సహాయాన్ని అందించిన సభ్యులకు ఆయన అభినందించారు. ఇతరులు కష్టాలలో ఉన్నప్పుడు వారు ప్రదర్శించిన మానవత్వం నిజంగా స్ఫూర్తిదాయకం అన్నారు. వీరి దాతృత్వం హొంగార్డ్ శ్రీనివాసరావులో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి త్వరగా కోలుకునేలా చేస్తుందని ఆకాంక్షించారు.

దేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చండి

ఐఐఎం రాయ్‌పూర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రామ్ కుమార్ కాకాని

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చడం, సమ్మిళిత, స్థిరమైన వృద్ధిని నిర్ధారించడం వంటి లక్ష్యాలు మన మందున్నాయని ఐఐఎం రాయ్‌పూర్ మాజీ డైరక్టర్ డాక్టర్ రామ్ కుమార్ కాకాని అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు 3వ స్నాతకోత్సవం, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవాన్ని ఆదివారం వర్సిటీ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రామ్ కుమార్ కాకాని మాట్లాడుతూ భారతంలో అర్జునుడు తన లక్ష్యమైన చేప కన్నుపైనే గురి పెట్టినట్లుగా.. విద్యార్థులు కూడా తమ లక్ష్యంపైనే దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. కృషితో ఏ రంగంలోనైనా ఋషులుగా మారొచ్చని చెప్పారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం మనిషి 105 సంవత్సరాల జీవితకాలానికి సరిపోయేట్లుగా ప్రణాళికలు రచించుకోవాలని సూచించారు. విద్యార్థులు నేటి సోషల్ ప్రపంచంలో మునిగిపోకుండా వ్యక్తిగత ప్రపంచం, వృతి పరమైన ప్రపంచానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. మనమందరం చూడాలని కోరుకునే అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో విద్యార్థులందరూ దోహదపడాలని పిలుపునిచ్చారు. ఒక దేశంగా, మనకు ప్రతిష్టాత్మక లక్ష్యాలు ఉన్నాయని, ఇవి కేవలం విధాన ఆశయాలు కాదని, అవి మీ శక్తి, మీ నైపుణ్యాలు, మీ ఆలోచనలు అవసరమయ్యే మిషన్‌లని తెలియజేసారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రైవేట్ పెట్టుబడులను పెంచడం లేదా మన విద్య, ఆరోగ్య సంరక్షణ

వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి అంశాల్లో మీ భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. పట్టభద్రులు ఈ బాధ్యతలను నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నప్పుడు వారికి దార్శనికులైన అధ్యాపకులు, విద్యావేత్తలు, సంస్థల సమిష్టి సహకారం అవసరమని చెప్పారు. ఇక్కడ ఉన్న అధ్యాపకులు, భాగస్వాములందరూ ఈ గొప్ప ప్రయత్నంలో చురుకుగా పాల్గొనాలని అభ్యర్థించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం ఆకాంక్షలను సాకారం చేసుకోవడానికి, సానుకూల మార్పును నడిపించడానికి మన సమిష్టి జ్ఞానం, నైపుణ్యం, అభిరుచిని ఉపయోగించుకుందామని పిలుపునిచ్చారు. సవాళ్లను అధిగమించడానికి, సమాజానికి అర్థవంతమైన సహకారాన్ని అందించడానికి మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోవాలని, సానుకూల మార్పును నడిపించే విషయాలలో చురుకుగా పాల్గొనమని విద్యార్థులను ప్రోత్సహించారు. మీ డొమైన్ ఏదైనా కావచ్చు.. కానీ ఆవిష్కరణ మాత్రమే సరిపోదు.. ప్రజల పట్ల బాధ్యతను నేటి ప్రపంచం కోరుతోందని వెల్లడించారు. మీరు రేపటి శ్రామిక శక్తి మాత్రమే కాదని, ఆవిష్కరణ, నాయకత్వం, మార్పునకు మార్గదర్శకులని తెలియజేసారు. విజయవాడలోని ఆర్ఆర్ స్పోర్ట్స్ ఫౌండర్ గల్లా రాధా రాణి మాట్లాడుతూ లక్ష్యాన్ని చేధించడంలో పట్టుదలే పెద్ద పెట్టుబడి అని, పట్టుదలతోనే లక్ష్య సాధన సాకారమవుతుందని అన్నారు. కెరీర్‌లో రాణించడానికి ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సమస్యల గుర్తింపుతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమని తెలిపారు. విద్యార్థులు ముందుగా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని, ఆ సమస్యల పరిష్కారానికి నూతన ప్రాజెక్టులను చేపట్టి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ దృక్కోణాన్ని విభిన్నంగా మార్చుకోవాలని, టెక్నాలజీని ఉపయోగించుకోవాలని.. అప్పుడే గొప్ప ఆవిష్కరణలు చేయగలరని పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణకు ప్రాముఖ్యత ఇవ్వడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, మరింత సమ్మిళిత సంఘాలను నిర్మించడం వంటి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని మీ పనిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులందరికీ నిరంతర అభ్యాసం అవసరమని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరగలరని అన్నారు. భారతావనికి ఇన్నోవేటర్ల అవసరం ఉందని, ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ ఎదిగిందని, 1.6 లక్షల స్టార్టప్స్, 100కిపైగా యూనికార్న్లు దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయని వెల్లడించారు. భారత జీడీపీలో ఇన్నోవేషన్ రంగం 10-15 శాతం వాటా కలిగి ఉందని, 2030 నాటికి ఇది 1 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుత భారత స్టార్టప్స్ దేశీయ సమస్యలే కాక ప్రపంచ అవసరాలను కూడా పరిష్కరిస్తున్నాయని తెలిపారు. వైస్ ఛాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ స్నాతకోత్సవం, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 1191 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం చేసిందని తెలిపారు. వీరిలో బీబీఏ డిగ్రీ 39, బీసీఏ డిగ్రీ 31, ఎంబీఏ డిగ్రీ 689, ఎంసీఏ డిగ్రీ 397, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ డిగ్రీ 35 మందికి అందించామని వెల్లడించారు. అభ్యర్థులలో 50 శాతం మంది మహిళలు ఉన్నారని తెలియజేసారు.

అంబరాన్నంటిన సంబరం:

డిగ్రీలు చేతబట్టుకున్న వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. విద్యార్థులందరూ గుర్తుగా సెల్ఫీలు దిగారు. తలపాగా, కండువా వేసుకుని విద్యార్థులంతా అచ్చతెలుగు సంప్రదాయాన్ని ప్రదర్శించారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు. కార్యక్రమంలో సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్: షమా సుల్తానా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇన్ఫెక్షన్‌ల వల్ల వచ్చే కొన్ని రకాల క్యాన్సర్లను నివారించడానికి హెచ్‌పివి (హ్యూమన్ పాపిలోమా వైరస్)వ్యాక్సిన్ దోహదపడుతుందని అబ్స్టేట్రిషిన్, గైనకాలజిస్ట్, ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ షమ సుల్తానా తెలిపారు. ఆదివారం హోప్‌విన్ హాస్పిటల్స్' చైర్‌పర్సన్ డాక్టర్ షమా సుల్తానా, ఫౌండర్ డాక్టర్ నజీరుద్దీన్‌ల ఆధ్వర్యంలో స్థానిక గుంటూరువారి తోట 7వ లైనులో ఉన్న హోప్‌విన్ హాస్పిటల్స్ ప్రాంగణం నందు 20 సంవత్సరాల లోపు వయసున్న 70 మంది యువతులకు ప్రాజెక్ట్ సర్విక హెచ్‌పివి వ్యాక్సిన్ రెండవ డోసు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ కొన్ని రకాల ఇన్ఫెక్షన్స్ నివారించడమే కాకుండా గర్భాశయ క్యాన్సర్, జననేంద్రియ మొటిమలు రాకుండా నిరోధిస్తుందన్నారు. 9 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వయసు గల ఆడ, మగ ఇద్దరికి కూడా ఈ టీకాను సిఫార్సు చేయడం

జరుగుతుందని, అలాగే గొంతు క్యాన్సర్ల నుండి రక్షించడంలో ఈ వ్యాక్సిన్ ఎంతో సహాయపడుతుందన్నారు. అదేవిధంగా రోగ నిరోధక వ్యవస్థను 9 నుండి 14 సంవత్సరాల వారిలో రోగ నిరోధక వ్యవస్థ అధికంగా ఉంటుందని, ఆ సమయంలో ఈ వాక్సిన్ వేయించినట్లయితే చాలా ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఒకవేళ ఈ వైరస్ బారినపడినట్లయితే వ్యాధి వృద్ధి చెందకుండా ఈ వ్యాక్సిన్ నిరోధిస్తుందని డాక్టర్ షమా సుల్తానా వెల్లడించారు.

కేఎల్‌యూలో స్కిల్ పలావర్ ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ, తన స్కిల్ డెవలప్‌మెంట్ డివిజన్ ఆధ్వర్యంలో విద్యార్థుల పరిశ్రమ అనుసంధానాన్ని పెంపొందించేందుకు రూపొందించిన స్కిల్ పలావర్ అనే ప్రాజెక్ట్-ఆధారిత లెర్నింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించినట్లు వర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బి-టెక్, బీసీఏ, ఎంసీఏ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించారని ఆయన అన్నారు. స్పెషలైజేషన్ ప్రొఫెషనల్ ఎలక్టివ్‌లు, ఇండస్ట్రీ-అలైండ్ స్కిల్ కోర్సులకు అనుసంధానంగా హ్యాకథాన్‌లను విద్యా విధానంలో భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవంతో కూడిన పరిశ్రమ అనుకూల నైపుణ్యాలును అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని స్పష్టం చేశారు. స్కిల్ పలావర్ మూడు దశల విధానాన్ని అనుసరిస్తుందన్నారు. లెర్న్‌థాన్ పరిశ్రమ నిపుణుల చేత యథార్థ సమస్యలపై ఇంటరాక్టివ్ సెషన్లు, వర్చువల్ రివ్యూలు, సెమిస్టర్ మధ్యలో డొమైన్ నిపుణుల ద్వారా ప్రోగ్రెస్ ఈ వాల్యుయేషన్ చేయించడం అని చెప్పారు.

హ్యాకథాన్, ఓపెన్ హౌస్..

తుది దశ ప్రత్యక్ష డెమో, పరిష్కారాల ప్రదర్శన, స్కిల్ పలావర్ ఫేజ్-1లో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు లెర్న్ థాన్

నిర్వహించారు. ఈ ఫేజ్-1లో సుమారు 1650 మంది ప్రీ-ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య సవాళ్లలో భాగంగా ఏఐ మెషిన్ లెర్నింగ్, సవాల్, క్లౌడ్ సవాల్ 1, లాబొరేటరీ వర్చువల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ స్ప్రింట్, మల్టీ ఫిజిక్స్ సిమ్యులేషన్ స్ప్రింట్ వంటి స్కిల్స్‌ను విద్యార్దులకు నేర్పుతున్నట్లు తెలిపారు.

పరిశ్రమ నిపుణుల మెంటరింగ్..

ఈ లెర్న్‌థాన్‌లో ప్రముఖ పరిశ్రమ నిపుణులు జి.అనిల్ కుమార్(సిస్కో), పి.తత్తమ్మదొర(ఐబీఎం), జి.నాగ సాయి రామ్(ఆన్సిస్), అనీష్(ఆద్యా స్కిల్స్) తదితరులు పాల్గొని విద్యార్థులకు యథార్థ సమస్యల సాంకేతిక అవరోధాలపై వివరణాత్మక శిక్షణ ఇచ్చారు. డెవలప్‌మెంట్ వ్యూహాలను రూపొందించడంలో మార్గదర్శనం చేశారు. కార్యక్రమ మార్గదర్శకులుగా ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రామకృష్ణ రావు, కన్వీనర్‌గా లెర్నాన్‌ను దగ్గరుండి నడిపించారు. సీఎస్ఈ, ఇసీఇ, ట్రిపుల్ఈ, మెకానికల్, ఏఐ డీఎస్, ఐఒటీ, బీసీఏ, ఎంసీఏ విభాగాల విభాగాధిపతులు, సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్ సమన్వయ బృందంగా పనిచేశారు. రాత్రికి రాత్రిలో డీప్ డైవ్ టెక్నికల్ సెషన్లు నిర్వహించారు. విద్యార్థుల బృందాలు ప్రారంభించే అడుగులను రూపొందించి, మరుసటి రోజు ఉదయం ప్రదర్శనలు ఇచ్చారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల్లో టెక్నికల్ ప్రాబ్లమ్-సాల్వింగ్, బృంద చర్య సహకారంతో ఇన్నోవేషన్ మైండ్‌సెట్ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ స్కిల్ పలావర్ అనేది విద్యార్థుల్లో స్వీయ అభ్యాసం ద్వారా బృందాత్మక పని విధానమని తెలిపారు. పరిశ్రమకు అవసరమైన ప్రాక్టికల్ ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేసే ఒక స్ట్రాటజిక్ ప్లాట్‌ఫామ్ అని తెలిపారు. తదుపరి దశలు ఈ స్కిల్ పలావర్ మొదటి దశతో ప్రారంభమై రెండు మరిన్ని దశలు ఆగస్టు నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీపీఎస్ వర్మ, ప్రోవీసీలు డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు శాశ్వత మార్గదర్శకత్వం అందించారు.

తొలి ఆరంగేట్రంతో అబ్బురపరిచిన పొట్లూరి చార్మి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక జేకేసీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం అమెరికా న్యూజెర్సీ నగరానికి చెందిన పొట్లూరి చార్మి భరత నాట్యం తొలి ఆరంగేట్రం నృత్య ప్రదర్శనలతో రసజ్ఞులను మైమరపించింది. ఆధ్యాత్మ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ శిక్షకురాలు కావ్య శేఖరన్ నేతృత్వంలో పుష్పాంజలి, ధిల్లాన, గజానన, దశావతార్, మయూరాష్టకం, దేవనామం వంటి 9కి పైగా నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ ఛార్మికి జ్ఞాపిక నందించి మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక జీవనంలో భరతనాట్యం దేశ విదేశాలలో కీర్తి గడించటంతో పాటు ఎన్నారై పొట్లూరి చార్మి అద్భుత ప్రదర్శనలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో చార్మి తల్లిదండ్రులు చైతన్య, జయప్రకాష్, ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్, కార్యక్రమం నిర్వాహకురాలు సీహెచ్ సుశీల, భరతనాట్య అభిమానులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

234వ రోజుకు చేరిన దీక్షలు

విశాలాంధ్ర-తాడేపల్లి : తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 234వ రోజుకి చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించారు. దీక్షలో కె.స్టీవెన్, ఎన్.సుబ్బారావు, తుపాకుల నాగేశ్వరరావు, నవనీతం, దుర్గమ్మ కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఏసీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చాలా నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : దేశంలో ప్రమాదాల బారిన పడు తున్న కోట్లాది మందిని ఆదుకోవడంలో రక్తం ప్రధాన భూమిక పోషిస్తు న్నదని, సరిపడినంత రక్త మందక అనేకమంది మృత్యువాత పడుతున్నారని రక్తదానం ప్రాధాన్యతను విద్యార్థులు, యువత గ్రహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ సేవా పథకం అధికారి మద్దినేని సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేట అపెక్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆధ్వర్యంలో డీఎస్ఆర్ ఫ్రెండ్స్, రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్ సహకారంతో స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని వందమందికి పైగా విద్యార్థులు రక్తదానం శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అపెక్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ వ్యవస్థాపకులు కొత్తపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా నాణ్యమైన స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణతో పాటు విలువలతో కూడిన జీవన విధానం, సమాజ సేవ ప్రాధాన్యత విద్యార్థులకు నేర్పుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫ్రెండ్స్ దామచర్ల శ్రీనివాసరావు, డాక్టర్ నీలిమ ప్రియదర్శిని, రెయిన్‌బో బ్లడ్ బ్యాంక్ నవీన్ చక్రవర్తి, విజేత కాంపిటీషన్స్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బాదుడే బాదుడు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఆదానీ మెప్పు కోసం కూటమి ప్రభుత్వం తీసు కొచ్చిన స్మార్ట్ మీటర్లు ప్రజలకు బాదుడే బాదుడు గుర్తుకు తెస్తుం దని పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు చెప్పారు. సుందరయ్య నగర్‌లో ఆదివారం స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ వివిధ బజార్లలో ప్రచారం నిర్వహిం చారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో బాదుడే బాదుడు అంటూ అధికార పక్షాన్ని ఇరుకునబెట్టి నేడు అధికారం వెలగబెడుతున్న అధికార పార్టీ అదేవిధంగా అమలు జరుపుతుందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు ఇంటికి బిగిస్తే గంటకో రేట్ చొప్పున వసూలు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటర్ల బిగింపు ఉపసంహరించుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తానని హెచ్చరించారు. సందర్భంగా మహిళా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరెంటు బిల్లుల ప్రతులను తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్.గిరిజ, కె.ఉష, బొబ్బిలి రామారావు, కె.ప్రభాకర్, సుధా, కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పొన్నూరు : రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో 21600 మంది రైతుల ఖాతాలలో నగదు జమ చేసినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల వద్ద ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసి చేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

క్రీస్తు సేవలో విశ్వగురువు ప్రసన్నత బాబు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రొటెస్టెంట్ బైబిల్ 1500, క్యాథలిక్ బైబిల్ 1900 పేజీల గ్రంథాలను చేతి వ్రాతతో వ్రాసి గ్రంథస్తం చేసిన జిడివి ప్రసన్నత బాబు ప్రభువైన యేసుక్రీస్తు సేవలో తరిస్తూ తన జన్మ సార్థకం చేసుకుంటున్నారని ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ రివైవల్ ఫోరం నాయకులు, ఆంధ్రబ్యాంకు విశ్రాంత ఏజీఎం గణేష్ పాల్ ప్రశంసించారు. ఆంధ్ర బ్యాంక్ విశ్రాంత చీఫ్ మేనేజర్, కీబోర్డ్ ప్లేయర్ ప్రసన్నత బాబు కరోనా సమయములో రెండు సంవత్సరాలు పైగా శ్రమించి రెండు బైబిళ్లను చేతివ్రాతతో వ్రాసి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విశ్వ గురువుగా అవార్డు అందుకున్న సందర్భంగా ప్రసన్నత బాబు, కమల దంపతులను స్థానిక కన్నావారితోట ఉల్ఫ్ స్టూడెంట్ చాపెల్ ప్రార్థన మందిరంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. రివైవల్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ ఎంజెవి గురునాథం, చీఫ్ అడ్వైజర్ డాక్టర్ టీజే రాజేంద్రప్రసాద్ ఆశీస్సులు అందజేయగా కార్యక్రమంలో చర్చి గురువులు వడ్లమూడి ఆదాం, క్రిస్టఫర్, సంఘ పెద్దలు కూరకుల డేవిడ్ నిరీక్షణరావు, రాజ శిఖామణి, కుమార్, దయారత్నరాజు, డాక్టర్ వైడిఎస్ రవి, డీకన్స్ జాన్ శామ్యూల్, కన్నయ్య, రఘుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ గ్రీన్ గుంటూరులో స్వచ్ఛంద సంస్థల
భాగస్వామ్యం కీలకం: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగర పాలక సంస్థ చేపట్టిన మిషన్ గ్రీన్ గుంటూరులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కీలకమని, వారు సూచనలు, సలహాలతో పర్యావరణహిత గుంటూరు కోసం కృషి చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మిషన్ గ్రీన్ గుంటూరుపై ఆదివారం ప్రత్యేక సమావేశం జరి గింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణహిత గుంటూరే లక్ష్యంగా గుంటూరు నగరపాలక సంస్థ మిషన్ గ్రీన్ గుంటూరు కార్య క్రమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఈ సీజన్‌లో దశలవారీగా 5 లక్షల మొక్కలను నాట డం ద్వారా పచ్చదనం పెంపు, పారిశుధ్య పనులలో మెరుగుదల, వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసి తీసుకోవడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విని యోగం, విక్రయం నిషేదం, నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు, జంక్షన్లు, ఐలాండ్స్, పార్కులు, డివైడర్లపై పచ్చదనం పెంపు వంటి చర్యలు పగడ్బందీగా తీసుకోబోతున్నామని తెలిపారు. మిషన్ గ్రీన్ గుంటూరుని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా స్వచ్ఛంద సంస్థలు ప్రధానంగా హోం, క్లస్టర్ కంపోస్ట్ తయారీ, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను అందించుట వంటి అంశాల్లో సహకరించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం అమలు, నిషేదం కేటగిరిలోకి వచ్చే వస్తువులతో స్టిక్కర్స్ కూడా రూపొందిస్తామని తెలిపారు. స్పందించిన చెలికాని సీతారామయ్య 1000 మొక్కలు నాటి సంరక్షిస్తామని, గుడ్డ సంచులను అందిస్తామని మానవత సంస్థ ప్రతినిధులు, హోం కంపోస్ట్, క్లస్టర్ కంపోస్ట్‌లపై ప్రజలకు వార్డుల వారీగా అవగాహన కలిగిస్తామని ఐటీసీ ప్రతినిధులు కమిషనర్‌కి తెలిపారు. సమావేశంలో గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఎకాలజీ ప్రొటెక్షన్ సర్వీస్ వ్యవస్థాపక అధ్యక్షులు చెలికాని సీతారామయ్య, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, సెక్రెటరి కె.సతీష్, ఐటీసీ ఫినిష్ మేనేజర్ నారాయణ, పర్యావరణ విద్య నోడల్ అధికారి తిరుపతిరెడ్డి, జీఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభల విజయవంతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-ఈపూరు : సీపీఐ మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు పోటీ పడి పనిచేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఊట్ల రామారావు, సీని యర్ నాయకులు సూరే అప్పా రావు అన్నారు. వినుకొండ పట్ట ణంలో జరిగే సీపీఐ రెండవ మహా సభలు ఈ నెల 7, 8 తేదీలలో నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో ఆదివారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీలే పోరాడుతాయని, సమస్యలపై పార్టీ తరపున ఉద్యమిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యాయని అన్నారు. ఇప్పటికీ నియంతృత్వ పోకడలు, అవినీతి మితిమీరిందని, ధరలను నియంత్రించడంలో కేంద్రం ఘోరంగా విఫలమైందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఉపన్యాసాలు ఇస్తున్నారే కానీ కొత్త ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. స్వతంత్ర వ్యవస్థలను కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకుని రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సంతకాల సేకరణ

విశాలాంధ్ర-మంగళగిరి : ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ ఆదివారం ఆత్మకూరులో సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరిగింది. సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడుతుందని అన్నారు. సెల్‌ఫోన్ రీఛార్జ్ లాగా కరెంటు కూడా రీఛార్జ్ చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ నెల 5న మంగళగిరి పట్ట ణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. విద్యుత్ వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఆత్మకూరు గ్రామ శాఖ కార్యదర్శి జాలాది విజయేంద్ర రావు, సీపీఐ నాయకులు కాబోతు ఈశ్వరరావు, పంతగాని మరియదాసు తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి విద్యుత్ వినియోగదారులకు దగ్గరకు వెళ్లి సంతకాలు సేకరించారు.

సీపీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : సీపీఐ పల్నాడు జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి కోరారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం కార్మికులతో కలిసి మహాసభపై ప్రచారం నిర్వహించారు. ఈ నెల 7, 8 తేదీల్లో 2వ జిల్లా మహాసభలు వినుకొండలో జరగనున్నట్లు రమణారెడ్డి పేర్కొన్నారు. 7వ తేదీన ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. కార్మికులు, రైతు, ఉద్యోగ, యువజన, విద్యార్థి, మహిళల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న పార్టీ సీపీఐ అని రమణారెడ్డి గుర్తుచేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య, ఆర్టీసీ ఏఐటీయూసీ పిడుగురాళ్ల కార్యదర్శి బంగారు శ్రీనివాసరావు, అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, షేక్ దస్తగిరి, బుడే, బి.ఎల్లయ్య, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం



విశాలాంధ్ర-మాచర్ల : రైతు సంక్షేమానికి సీఎం చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. యాగంటి మాట్లాడుతూ మాటకు కట్టుబడటం సీఎం చంద్రబాబుకే సాధ్యమన్నారు. అధికారం చేపట్టిన సంవత్సరకాలంలోనే సూపర్ సిక్స్ పథకాలు మూడొంతులు నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో 46.85 లక్షల మంది రైతులకు మొదటి విడతగా రూ.3,174.43 కోట్లు నేరుగా ఖాతాల్లోకి జమచేసి రైతుల కళ్ళల్లో ఆనందాన్ని నింపారన్నారు. రైతులపై నీటి పన్ను వడ్డీగా చెల్లించాల్సిన రూ.70 కోట్లు మాఫీ చేసి రైతులను ఆదుకున్నట్టు తెలిపారు. యువ నాయకుడు నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు తెప్పించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మా రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన పల్నాడు ప్రాంత సస్యశ్యామలం కోసం వరికపూడిశెల నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొద్దికాలంలోనే మాచర్ల మరింత అభివృద్ధి చెంది పట్టణ రూపురేఖలు మారనున్నాయని అన్నారు.

నాగార్జునకొండలో పర్యాటకుల సందడి

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : నాగార్జున కొండను పర్యాటకులు ఆదివారం భారీగా తిలకించారు. ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు నాగార్జున కొండకు తరలివచ్చి సందడి చేశారు. పర్యాటకులు కేరింతలు కొడుతూ లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లారు. కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధశాల, స్నానాల గట్టు, బోధి వృక్షం చూసి తన్మయం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేధ యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. లాంచీల ద్వారా రూ.2,12,750ల ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు పేర్కొన్నారు.

పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలికి సన్మానం

విశాలాంధ్ర-పెడన: ఉపాధ్యాయ వృత్తిలో గత 30 సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది జులై 31న పదవీ విరమణ చేసిన బట్ట. భానుమతి ని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పట్టణంలో ఆదివారం షాదీఖానాలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెడన మండల విద్యాశాఖ అధికారి -1 ఎం వి ఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు కంటే ఉపాధ్యాయ వృత్తి చాలా కష్టతరంగా కూడుకున్నదని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులను విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థాయిలో విద్యనభ్యసించి ఎంతో మంది జీవితాలను వెలుగు నింపిన మహోన్నత వ్యక్తి భానుమతి అని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

ముగిసిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం

-ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తరుపున నామినేషన్ దాఖలు చేసిన డాక్టర్ కె.గోవింద రెడ్డి

విశాలాంధ్ర- విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ 2025-2028 కాలానికి జరుగనున్న ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 16వ తేదీన జరగనున్న ఎన్నికల నేపథ్యంలో, ఆదివారం మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంలో నామినేషన్లు దాఖలు చేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పదవికి ప్రస్తుత ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ తరుపున కర్నూల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ .కె.గోవిందరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ కి సమర్పించారు. ఏసీఏ అధ్యక్షుడు పదవికి కేశినేని శివనాథ్ , వైస్ ప్రెసిడెంట్ పదవికి బండారు నరసింహారావు, సెక్రటరీ పదవికి సానా సతీష్ బాబు, ట్రెజరర్ పదవికి దండమూడి శ్రీనివాస్ , కౌన్సిలర్ పదవికి దండు గౌర్ విష్ణు తేజ్ మాత్రమే నామినేషన్లు దాఖలు చేయగా, జాయింట్ సెక్రటరీ పదవికి బి. విజయ్ కుమార్, బి. శ్రీనివాసరాజు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నామినేషన్స్ ఉపసంహరణ కి ఆగస్టు 11 వ తేదీ తుది గడువుగా నిర్ణయించారు. ఎన్నికల ఫలితాలు ఆగస్టు 16వ తేదీ వెలువడతాయి.

విజయవంతంగా ముగిసిన నెఫ్రాలజీ దక్షిణ భారత సంఘం 44వ వార్షిక సదస్సు

విశాలాంధ్ర- విజయవాడ లబ్బీపేట : ఆగస్టు 1 నుండి 3, 2025 వరకు దక్షిణ భారత నెఫ్రాలజీ సంఘం 44వ వార్షిక సదస్సు విజయవంతంగా విజయవాడలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ నెఫ్రాలజీ సంఘం అధ్యక్షులు డా. అమ్మన్న గ మరియు డా. శివరామకృష్ణ సారథ్యంలో జఘనంగా నిర్వహించబడింది. ప్రారంభోత్సవాన్ని డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గౌరవ వీసీ డాక్టర్ చంద్రశేఖర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సదస్సుకు 600 మందికిపైగా ప్రతినిధులు దేశ విదేశాల నుండి హాజరయ్యారు. 300కిపైగా శాస్త్రీయ వ్యాసాలు సమర్పించబడి నెఫ్రాలజీ రంగంలో తాజా పరిశోధనలకు ప్రతిబింబంగా నిలిచాయి. ప్రధానంగా కిడ్నీ వ్యాధులు, డయాలసిస్, కిడ్నీ మార్పిడి, నూతన ఔషధాలు, సాంకేతిక పురోగతులు వంటి అంశాలపై చర్చించబడింది. బెంగళూరులోని ఐఐ ఎస్ సీ కు చెందిన డా. స్వామినాథన్, జెనో ట్రాన్స్‌ప్లాంటేషన్ భవిష్యత్ పథాలపై వైద్య పరిశోధనలో జరుగుతున్న విప్లవాత్మక అభివృద్ధులపై ప్రత్యేక ప్రసంగం ఇచ్చారు. హైదరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ నెఫ్రాలజీ విభాగాధిపతి డా. మంజుషా రైతుల్లో జరుగుతున్న పరాక్వాట్ విషపానం, ఆత్మహత్యలు మరణాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ విషపూరిత రసాయనాన్ని నిషేధించేందుకు ఎస్సీఐఎస్ఎన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. గుంటూరు విజయవాడ నుండి వచ్చిన నెఫ్రాలజిస్టులు ఈ సదస్సు నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. సదస్సుకు విచ్చేసిన ప్రతినిధుల కోసం నిర్వాహకులు కనకదుర్గ అమ్మవారి ప్రత్యేక దర్శనాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 350 మందికి శీఘ్ర దర్శనం జరగగా, దుర్గగుడి అధికారులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సదస్సులో డా. గురుదేవ్ (ఎస్సీఐఎస్ఎన్ అధ్యక్షులు), డా. శ్రీభూషణ్ రాజు (ఎస్సీఐఎస్ఎన్ కార్యదర్శి), డా. శివకుమార్ ,డా. రవిరాజు , డా. అనురాధ డా. గిరీష్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాహినిలో నీట్ జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-తిరువూరు: స్థానిక శ్రీ వాహిని ఇంజనీరింగ్ కళాశాలలో నీట్ పిజి 2025 పరీక్షను నేషనల్ మెడికల్ కమీషన్ అనుగుణంగా (%చీవీజ%) నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ మెడికల్ సైన్స్ (%చీదీజుమీ%) కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ను ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 150 మంది విద్యార్థులనుదక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల కేటాయించుగా 117 మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ మరియు ప్రేక్ష ప్రధానాధికారి డాక్టర్ రంగా ప్రిన్సిపాల్ తెలిపారు.అదే విధంగా ఈ పరీక్షకు పరిశీలికులుగా నియమితులై డాక్టర్ ఈ గౌరీ అసోసియేట్ ప్రొఫెసర్ పీడియాట్రిక్స్ మచిలీపట్నం నుంచి వచ్చి పరీక్షా నిర్వహణను భద్రత, శుభ్రత మరియు వివిధ నిబంధనలకు అనుగుణంగా ప్రశాంతంగా జరిగే విధంగా పర్యవేక్షించారు.పరీక్షను ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించిన నిర్వహించడంలో సహకరించిన అధికారులందరూ మరియు సిబ్బందికి కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపినారు.

పుస్తక పఠనంలో ఆబాలగోపాలం

- ప్రజల్లో పఠానాసక్తిని పెంపొందించేందుకు 'పేజ్ క్లబ్' అద్వితీయ కార్యక్రమం
- వందలాది మందిని ఒక్కచోట చేర్చి పుస్తకం పట్టించిన చిన్నారుల మహా సంకల్పం
- ఫన్ టైమ్స్ క్లబ్ వేదికగా సామూహిక పుస్తక పఠన వేడుక
- పేజ్ క్లబ్ పుస్తక పఠనోద్యమానికి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - విజయవాడ ఎడ్యుకేషన్ : విజ్ఞాన సముపార్జనతో పాటు, మనో వికాసానికి పుస్తక పఠనం ఎంతో అవసరం. నేటి డిజిటల్ యుగంలో పుస్తక పఠనం క్రమక్రమంగా కనుమరుగైపోతోంది. పుస్తక పఠనమంటేనే అదో ప్రహసనంగా భావించబడుతున్న పరిస్థితుల్లో కొందరు చిన్నారుల సంకల్పం పుస్తక పఠన మహోద్యమంగా మారింది. ప్రజల్లో పుస్తక పఠనాసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఆవిర్భవించిన పేజ్ క్లబ్.. అబాలగోపాలన్నీ ఒక్కచోటికి చేర్చి పుస్తకం పట్టేలా చేసింది. పేజ్ క్లబ్ ఆధ్వర్యంలో పటమట ఫన్ టైమ్స్ క్లబ్ నందు ఆదివారం జరిగిన ఈ అద్వితీయ కార్యక్రమంలో దాదాపు 200 మంది పాల్గొని పుస్తక పఠనం చేశారు. చిన్నారుల నుంచి వయో వృద్ధుల వరకు, విద్యార్థుల నుంచి వివిధ రంగాల్లో నిష్ణాతులైన వ్యక్తుల వరకు.. అందరూ ఒకే వేదిక పైకి వచ్చి పుస్తక పఠనం కావించారు. ప్రభాత సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పుస్తక పఠన వెలుగులను ప్రస్ఫుటంగా ప్రసరింపజేసింది. పుస్తక పఠనం పట్ల చైతన్య స్ఫూర్తిని కలిగించిన 'పేజ్ క్లబ్'కు ఏడాది క్రిందట అంకురార్పణ జరిగింది. పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరికీ అలవాటు చేయాలనే సంకల్పంతో, ప్రస్తుతం 11, 12 గ్రేడ్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులు 'పేజ్ క్లబ్'కు రూపకల్పన చేశారు. పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేసేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, కర్మాగారాల్లో పుస్తక పఠన కార్యక్రమాలను నిర్వహించారు. స్మార్ట్ ఫోన్ యుగంలో కనుమరుగైపోయిన పుస్తక పఠనాసక్తిని పునరుద్ధరించడం కోసం 'పేజ్ క్లబ్' మొక్కవోని పట్టుదలతో శ్రమించింది. వారి ప్రయత్నం ఫలించి, ఆదివారం నిర్వహించిన సామూహిక పుస్తక పఠనం విజయవంతమైంది. పేజ్ క్లబ్ ఆవిష్కర్తలైన విహాన్ సాయి వేములపల్లి, ఈషాన్వి నిమ్మగడ్డ, జైదేవ్ చౌదరి అవిర్నేని, మోక్షిత్, రోనక్ బగ్రేచాల స్వప్నం ఫన్ టైమ్స్ క్లబ్ వేదికగా సాకారమైంది. పేజ్ క్లబ్ చేపట్టిన పుస్తక పఠనోద్యమానికి వివిధ వర్గాల వారి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తమ గృహ సముదాయాల్లో, కార్యాలయాల్లో పుస్తక పఠన కార్యక్రమాలను నిర్వహించాల్సిందిగా 'పేజ్ క్లబ్' నిర్వాహకులను పలువురు స్వాగతించారు.